

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV — STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా





సంపుటి - 07 | సంచిక 220 | ఎడిటర్ : బరిగెల శివ | శుక్రవారం, 10, జులై 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్






డాక్టర్ బరిగెల శివ
జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్



# నూతన సీఎస్‌పై..
# బోలెడు ఆశలు!



వెనుకబడిన జాతుల అభ్యున్నతికి పాటుపడాలి

పేరుకుపోయిన సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలి

రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రజాపాలనకు పూర్తి న్యాయం చేయాలి

నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా చూడాలి

వికలాంగుల సంక్షేమానికి పునాదులు వేయాలి

రైతుల కష్టాలు తీర్చడంలో మెరుగైన సేవలు అందించాలి

తెలంగాణ రాష్ట్ర పాలన సిఎస్ పైనే ఆధారపడి ఉంది

తెలంగాణ ప్రజల ఆకాంక్షలు ఇప్పటికీ నెరవేరలేదు

ఇతర ప్రాంతాల వాదుల తెలంగాణలో చేస్తున్న దాడులు పెరిగిపోతున్నాయి

సిఎస్ సంజయ్ జాజు ఐఏఎస్ ప్రత్యేకతను రాష్ట్ర ప్రజలకు అంకితం చేయాలి

డాక్టర్ బరిగెల శివ

**తెలంగాణ రాష్ట్ర నూతన ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు నాయకత్వంలో ప్రజాకేంద్రిత పాలన మరింత బలోపేతం కావాలని జై భీమ్ సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ బరిగెల శివ ఆకాంక్షించారు. రాష్ట్రంలో పేరుకుపోయిన సమస్యల పరిష్కారం, వెనుకబడిన వర్గాల అభ్యున్నతి, నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాల కల్పన, రైతు సంక్షేమం, వికలాంగుల** సంక్షేమం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. సచివాలయంలో సీఎస్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, మహనీయుల చిత్రపటాన్ని జ్ఞాపికగా అందజేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. తదనంతరం మాట్లాడుతూ, తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వ యంత్రాంగాన్ని సమన్వయం చేసి ప్రజలకు సమర్థవంతమైన పాలన అందించడంలో సీఎస్ కీలక పాత్ర పోషించాలని అన్నారు. రాష్ట్రంలో ఉద్యోగ ఖాళీల భర్తీ, భూ సమస్యల పరిష్కారం, సాగునీటి ప్రాజెక్టుల పురోగతి, విద్యా వ్యవస్థ బలోపేతం, కార్మికులు, మహిళలు, రైతులు, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అలాగే అవినీతి నిర్మూలన, మాదకద్రవ్యాల నియంత్రణ, ప్రజాధన పరిరక్షణ వంటి అంశాల్లో కఠిన చర్యలు తీసుకుంటూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే పాలన అందించాలని నూతన సీఎస్‌కు సూచించారు.

- జై భీమ్ న్యూస్, హైదరాబాద్

2



## 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్స్ ఆర్థిక వ్యవస్థ

దేశ ఆర్థిక వ్యవస్థలో 10శాతం వాటా సాధించేలా ప్రణాళికలు

తెలంగాణను అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

ఓఆర్ఆర్ లోపలున్న పరిశ్రమలను ఓఆర్ఆర్ వెలుపలకు తరలింపు

హైదరాబాద్‌ను కాలుష్యం నుంచి తప్పించే చర్యలు

ఇండియాస్ నెక్స్- జెన్ సోలార్ మాడ్యూల్ యూనిట్ ప్రారంభంలో సిఎం రేవంత్

5



## వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తున్నాం

రెండున్నరేళ్లలోనే 35వేల కోట్లు రైతులకు అందచేత

రైఊతులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తున్నాం

బిఆర్ఎస్ పాలనలో క్రాప్ డ్యామేజ్‌కు కెసిఆర్ ఒక్క పైసా ఇవ్వలేదు

ఖమ్మం పర్యటనలో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క



7

## మూసీ పునరుజ్జీవన ప్రాజెక్ట్ తొలిదశ పనులకు గ్రీన్ సిగ్నల్

రూ.7,345.12 కోట్ల పరిపాలనా అనుమతులు ఇస్తూ ఉత్తర్వులు

**హైదరాబాద్,జూలై9(జై భీమ్ న్యూస్) :**

మూసీ పునరుజ్జీవన ప్రాజెక్ట్ తొలి దశ పనులకు తెలంగాణ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టుకు రూ. 7,345.12 కోట్ల పరిపాలనా అనుమతులు ఇస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. జోన్‌-1ఏ, జోన్‌-1బీ ప్రాధాన్య కారిడార్లలో మూసీ అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. హిమాయత్‌సాగర్ నుంచి బాపూఘాట్ వరకు 9.20 కి.మీ., ఉస్మాన్‌సాగర్ నుంచి బాపూఘాట్ వరకు 11.80 కి.మీ. మేర అభివృద్ధి పనులు కొనసాగనున్నాయి. మొత్తం 21 కి.మీ. ప్రాధాన్య స్ట్రెచ్‌లో రివర్‌ఫ్రంట్ పనులు జరుగనున్నాయి. భూసేకరణ వ్యయం మినహా రూ.7,345.12 కోట్లకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఇందులో ఏడీబీ నుంచి రూ.4,500 కోట్ల రుణాన్ని తీసుకోనుండగా..మిగతా .2,845.12 కోట్లు ఊఓఆం లేదా ఃుఉఎఎఅ నుంచి రుణం తీసుకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.

## ఆదివాసుల ఆణిముత్యానికి జన్మదిన శుభాకాంక్షలు

బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం శ్రమిస్తున్న సీతక్క.
మహిళా మంత్రిగా చిరస్మరణీయమైన సేవలందిస్తున్నారు.
ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న సీతక్క.
మంత్రి సీతక్క నివాసంలో జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన డాక్టర్ బరిగెల శివ.

3



జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE

# మంత్రి సీతక్కకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన డీఎస్పీ ఎదుల్ల కిషోర్



**ములుగు(జై భీమ్ న్యూస్)**

రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) జన్మదిన సందర్భంగా ములుగు జిల్లా క్రైమ్ డీఎస్పీ ఎదుల్ల కిషోర్ ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి నివాసానికి వెళ్లిన డీఎస్పీ పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క ప్రజాసేవలో మరింత విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. అలాగే ఆమె నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవిస్తూ ప్రజలకు మరింత సేవ చేయాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ మర్యాదపూర్వక భేటీ ఆత్మీయ వాతావరణంలో జరిగింది.

# 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్స్ ఆర్థిక వ్యవస్థ

**దేశ ఆర్థిక వ్యవస్థలో 10శాతం వాటా సాధించేలా ప్రణాళికలు**
**తెలంగాణను అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం**
**ఓఆర్ఆర్ లోపలున్న పరిశ్రమలను ఓఆర్ఆర్ వెలుపలకు తరలింపు**
**హైదరాబాద్‌ను కాలుష్యం నుంచి తప్పించే చర్యలు**
**ఇండియాస్ నెక్ట్స్- జెన్ సోలార్ మాడ్యూల్ యూనిట్ ప్రారంభంలో సిఎం రేవంత్**

**హైదరాబాద్,జూలై9(జై భీమ్ న్యూస్):**

2047 నాటికి తెలంగాణ 3 ట్రిలియన్ డాలర్స్ ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణను దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. షాబాద్ మండలం సీతారాంపురంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఇండియాస్ నెక్ట్స్- జెన్ సోలార్ మాడ్యూల్ యూనిట్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడారు. యువతలో నైపుణ్యాభివృద్ధి కోసమే.. స్కిల్స్ యూనివర్సిటీ నెలకొల్పాం. ఏటా 1.10 లక్షల మంది యువత ఇంజినీరింగ్ పట్టాలతో బయటకి వస్తున్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పరిశ్రమలు రావాలి. బ్లూకాలర్ ఎంప్లాయిస్‌లో కొత్త స్కిల్స్ పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. సీతారాంపురం ప్రజల త్యాగాల వల్లే ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటయ్యాయని తెలిపారు. గతంలోనూ రంగారెడ్డి జిల్లా ప్రజల త్యాగాల వల్లే ఓఆర్ఆర్, పరిశ్రమలు వచ్చాయన్నారు. అత్యంత నివాస అనుకూల నగరాల జాబితాలో హైదరాబాద్ ముందుంటుంది. అయినప్పటికీ హైదరాబాద్‌ను కూడా కాలుష్య సమస్య వేధిస్తోంది. 1.34 కోట్ల మంది ఓఆర్ఆర్ లోపల నివసిస్తున్నారు. ఓఆర్ఆర్ లోపలున్న పరిశ్రమలను ఓఆర్ఆర్ వెలుపలకు తరలించాలని నిర్ణయించాం. పెరి అర్బన్ రీజియన్‌లో ప్రత్యేక మాన్యుఫ్యాక్చరింగ్ జోన్లు ఏర్పాటుచేస్తున్నామని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి, పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, ఉపాధి అవకాశాలపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. రాజకీయంగా ఎన్ని ఆరోపణలు వచ్చినా తమ ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధినే లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తోందని సీఎం అన్నారు. ఎన్నికల సమయంలో రాజకీయాలు ఉంటాయని, ప్రస్తుతం రాష్ట్ర అభివృద్ధికి అందరూ సహకరించాలని ప్రతిపక్షాలను కోరారు. అధికారం కోల్పోయిన బాధ ఉన్నా అభివృద్ధిని అడ్డుకోవద్దని, తమ ప్రభుత్వానికి కొంత సమయం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దేశ రాజధాని ఢిల్లీలో కాలుష్యం, బెంగళూరు, చెన్నై వంటి నగరాల్లో ట్రాఫిక్ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని పేర్కొన్న సీఎం.. అలాంటి పరిస్థితులు హైదరాబాద్‌లో రాకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేస్తున్నామని చెప్పారు. అందుకే ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న సుమారు 2,100 చ.కి.మీ. ప్రాంతాన్ని ఏరియాగా అభివృద్ధి చేయాలని నిర్ణయించామని తెలిపారు. అలాగే రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్ ప్రాంతాలుగా విభజించి సమతుల అభివృద్ధి సాధించే దిశగా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించిందని వెల్లడించారు. దేశ ఆర్థిక వ్యవస్థలో తెలంగాణ 10శాతం వాటా సాధించేలా ప్రణాళికలు అమలు చేస్తున్నామని చెప్పారు. ప్రజల సహకారంతో 2034 నాటికి రాష్ట్రాన్ని1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. ప్రపంచ స్థాయి పెట్టుబడులను ఆకర్షించాలంటే మెరుగైన మౌలిక సదుపాయాలు అవసరమని సీఎం అభిప్రాయ పడ్డారు. యువతకు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు అందించేందుకు అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్లు, స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సీతారాంపూర్‌లో సోలార్ మాడ్యూల్ తయారీ యూనిట్ ప్రారంభం కావడం సంతోషకరమని పేర్కొన్న సీఎం.. ఈ ప్రాజెక్టు కోసం భూములు కోల్పోయిన కుటుంబాలకు ఇంటి పట్టాలు ఇవ్వడంతో పాటు ఉపాధి కోసం వ్యాపార సముదాయాలు నిర్మించి అందించాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. రంగారెడ్డి జిల్లా రైతులు చేసిన త్యాగాల వల్లే ఈ అభివృద్ధి సాధ్యమైందని సీఎం కొనియాడారు. చేవెళ్ల నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అలాగే బుద్వేల్ నుంచి కొడంగల్ వరకు 100 మీటర్ల వెడల్పుతో రహదారి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని వెల్లడించారు. సీతారాంపూర్‌లో నిర్మిస్తున్న ఆలయ ప్రారంభోత్సవానికి త్వరలో మరోసారి వస్తానని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రజల సహకారంతో తెలంగాణను అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకెళ్తామని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.



# నూతన సీఎస్‌పై బోలెడు ఆశలు

**వెనుకబడిన జాతుల అభ్యున్నతికి పాటుపడాలి**
**పేరుకుపోయిన సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలి**
**రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రజాపాలనకు పూర్తి న్యాయం చేయాలి**
**నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా చూడాలి**
**వికలాంగుల సంక్షేమానికి పునాదులు వేయాలి**
**రైతుల కష్టాలు తీర్చడంలో మెరుగైన సేవలు అందించాలి**
**తెలంగాణ రాష్ట్ర పాలన సిఎస్ పైనే ఆధారపడి ఉంది**
**తెలంగాణ ప్రజల ఆకాంక్షలు ఇప్పటికీ నెరవేరలేదు**
**ఇతర ప్రాంతాల వాదుల తెలంగాణలో చేస్తున్న దాడులు పెరిగిపోతున్నాయి**
**సిఎస్ సంజయ్ జాజు ఐఏఎస్ ప్రత్యేకతను రాష్ట్ర ప్రజలకు అంకితం చేయాలి**
**డాక్టర్ బరిగెల శివ**

**హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)**

తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడం కొరకు తెలంగాణ రాష్ట్ర నూతన సీఎస్ సంజయ్ జాజు తన ప్రత్యేకతలు కనపరిచే ఆస్కారం ఉందని డాక్టర్ బరిగెల శివ ఆశాభావం వ్యక్తం చేశారు.తెలంగాణ రాష్ట్ర ప్రజల మనోభావాలకు అనుకూలంగా రాష్ట్ర పాలన కొనసాగించబడే విధంగా ప్రభుత్వ పెద్దలను సమన్వయ పరచడంలో నూతన సిఎస్ తన ప్రత్యేకతను చాటగలరని వివరించారు.తెలంగాణ రాష్ట్రంలో పెరిగిపోతున్న నిరుద్యోగ యువతను ఆదుకునే బాధ్యతగా రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగ నియామకాలు విడుదల చేస్తూ నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించబడే విధంగా ప్రత్యేక కార్యచరణ రూపొందించి ప్రభుత్వం ద్వారా పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా, ఉద్యోగ నియామక ప్రక్రియలు విడుదల చేయుటకు సహకరించాలని అలాంటి అవకాశాల కోసం నిరుద్యోగులు ఎంతగానో ఎదురుచూస్తున్నారని తెలిపారు.గురువారం సచివాలయ భవనంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజును మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి జై భీమ్ సంస్థ నిర్మాణంలో భాగమైన మహనీయుల చిత్రపటాన్ని జ్ఞాపికగా బహుకరించి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా డాక్టర్ బరిగెల శివ మాట్లాడుతూ రాష్ట్ర బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం,అభ్యున్నతి కోసం ప్రభుత్వం పాటుపడే విధంగా సిఎస్ సంజయ్ జాజు తన వ్యక్తిగత ప్రతిభను కనపరచగలరని ఆశాభావాన్ని వ్యక్తపరిచారు.రాష్ట్రంలో కొంతకాలంగా జరుగుతున్న అలజడులను గమనిస్తుండగా రాష్ట్ర ప్రజల ఉనికి రాష్ట్ర ప్రజల విశ్వాసం సన్నగిల్లుతున్నట్లుగా కనిపిస్తున్న సందర్భంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన సీనియర్ ఐఏఎస్ సంజయ్ జాజు తన అనుభవాన్ని వినియోగిస్తూ రాష్ట్ర ప్రజల బాగోగు కొరకు తెలంగాణ రాష్ట్రంలో ప్రజాస్వామ్య పాలన అందించబడే విధంగా రాజ్యాంగ విలువలకు అనుగుణంగా రాష్ట్రంలోని ప్రజాపాలనను ముందుకు నడిపించుటకు పూర్తి సంసిద్ధతను కనపరచగలరని ఆశాభావం వ్యక్తం చేశారు.తెలంగాణ ప్రజలు 12 సంవత్సరాలుగా ఎంతో విలువైన అభివృద్ధిని కోల్పోయారని కొన్నిచోట్ల ప్రధాన అభివృద్ధి జరగగా మరికొన్ని చోట్ల అభివృద్ధి కుంటుబడిపోయిందని తెలంగాణ ప్రజలు భావిస్తున్నారని తెలిపారు.నిరుద్యోగులు ఉద్యోగ నోటిఫికేషన్ రాక చాలా వేదన పడుతున్నారని రాష్ట్రం ప్రజా పాలన సిద్ధాంతాలను అనుసరిస్తూ అభివృద్ధి చెందుతున్న సందర్భంలో నిరుద్యోగుల ఆశలను బలపరుస్తూ రాష్ట్ర ప్రభుత్వంలోని ఉద్యోగ ఖాళీలను భర్తీ చేసినప్పుడే ప్రజాపాలనకు సంపూర్ణ విలువలు దక్కుతాయని నూతన సిఎస్ ఆ దిశగా రాష్ట్ర పాలనను అభివృద్ధి పథంలోనికి నడిపించే బాధ్యతను తీసుకుంటారని ఆశిస్తున్నామన్నారు.

**రాష్ట్రాన్ని వెంటాడుతున్న జటిలమైన సమస్యలు..**

తెలంగాణ రాష్ట్రంలో ప్రధాన సమస్యలు జటిలంగా మారిపోయాయని వాటిని పరిష్కరించడం కోసం నూతన సీఎస్ ఎంతో బాధ్యతతో కూడిన సేవలను అందించాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ప్రజలు భావిస్తున్నారన్నారు.రెండు రాష్ట్రాలకు నీటి ప్రాజెక్టుల విషయంలో నీటి సమస్య ఇప్పటికీ కొలిక్కి రాలేదని రాష్ట్ర విభజన చట్టంలో పొందుపరిచిన విధంగా ప్రధాన ప్రాజెక్టులలోని నీటిమట్టాన్ని ఉభయ రాష్ట్రాలకు పంపకాలలో జరుగుతున్న లోపాలను సవరించబడే విధంగా సహాయపడగలిగితే రాష్ట్ర ప్రజలకు రాష్ట్ర రైతులకు నీటి కొరత ఏర్పడదని గుర్తు చేశారు.గత ప్రభుత్వంలో కట్టిన ప్రాజెక్టులు ప్రస్తుత ప్రభుత్వంలో ప్రారంభిస్తున్న ప్రాజెక్టులు సకాలంలో పూర్తి చేయబడే విధంగా రీ డిజైన్స్ పేరుమీద ఆగిపోయిన ప్రాజెక్టులను తక్షణమే పూర్తి చేసి రాష్ట్ర రైతులకు చేయూతనందించాలని కోరారు.రాష్ట్ర విద్యా వ్యవస్థ జాతీయ నూతన విద్యా విధానంతో పూర్తిస్థాయిలో మరుగున పడబోతుందని విద్యా వ్యవస్థను కాపాడడానికి విద్యావ్యవస్థలో జరుగుతున్న అధికార దుర్వినియోగాన్ని అరికట్టాలని వాటిపై సిఎస్ ప్రత్యేక దృష్టి పెట్టగలరని ఆశాభావం వ్యక్తం చేశారు.తెలంగాణ రాష్ట్రంలో పరిశ్రమల పేరు మీద భూదోపిడి జరుగుతుందని వాటిని నియంత్రించడం కోసం ప్రత్యేక కార్యచరణ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వానికి సరైన నివేదికలను అందించడం ద్వారా భూదోపిడిని అరికట్టగలమని నిరూపించుట కొరకు సిఎస్ తన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించగలరని వ్యక్తిగత అభిప్రాయాన్ని వెల్లడించారు.రాష్ట్రంలో ప్రభుత్వ ప్రైవేటు రంగాల్లో పనిచేస్తున్న కూలీలు కార్మికులు ఔట్సోర్సింగ్ ఉద్యోగులు పార్ట్ టైం ఉద్యోగులు కాంట్రాక్టు ఉద్యోగులు చాలీచాలని జీతాలతో తీవ్రమైన మనోవేదన చెందుతున్నారని ప్రస్తుతం రాష్ట్ర బడ్జెట్ మూడు లక్షల 9 కోట్ల వరకు చేరుకోగా రాష్ట్ర అభివృద్ధి ప్రయోజనాల దృష్ట్యా ఇలాంటి చిన్న కారు ఉద్యోగులను ఆదుకొని తీరాలని తక్షణమే వాళ్ళ ఉద్యోగాలకు భద్రత కల్పించబడే విధంగా సహాయపడుతూనే రాష్ట్రంలోని కార్మికులకు కూలీలకు ప్రభుత్వం ద్వారా ప్రత్యేక రాయితీలతో కూడిన లోన్లను మంజూరు చేస్తూ ఆదుకోవాలని గుర్తు చేశారు.మహిళ సాధికారత రూపంలో రాష్ట్ర మహిళలకు పెద్ద ఎత్తున లాభం జరిగే విధంగా ప్రభుత్వాన్ని ముందుకు నడిపించే బాధ్యతను సమర్థవంతంగా తీసుకోవాలని గుర్తు చేశారు.ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రాన్ని పట్టిపీడిస్తున్న ప్రధానమైన విషయాలలో ప్రజాధనం ఎక్కువ స్థాయిలో దుర్వినియోగపరచబడుతుందని దానిని నియంత్రించి రాష్ట్ర నిధులను ప్రభుత్వ నిధులను పేద ప్రజల నిధులను రక్షిస్తూ ప్రజాసేవ అభివృద్ధి పరచబడడం కోసం మెరుగైన సేవలను కొనసాగిస్తూ ప్రభుత్వాన్నిగానీ రాష్ట్ర ప్రభుత్వ శాఖలలో పనిచేస్తున్న అధికారులను గాని ప్రజల అభివృద్ధి కోసం మెరుగైన సేవలను అందించబడే విధంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రత్యేక ప్రణాళికలను సిద్ధం చేసి రాష్ట్రవ్యాప్తంగా అమలు పరచబడే విధంగా చొరవ చూపాలని తెలిపారు.రాష్ట్రంలో సామాన్యులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను క్షేత్రస్థాయిలో పసిగట్టి మత విద్వేషాలతో కుల విద్వేషాలతో జరుగుతున్న దాడులను పూర్తిస్థాయిలో నిర్మూలించబడే విధంగా ప్రత్యేకతను చాటాలని కోరినారు.రాష్ట్రవ్యాప్తంగా యువత జీవిత లక్ష్యాల వైపు కన్నా మాదకద్రవ్యాల ఆకర్షణ వైపు ఎక్కువగా అడుగులు వేస్తున్నారని తెలంగాణ రాష్ట్రాన్ని మాదకద్రవ్యాల నిర్మూలన రాష్ట్రంగా తీర్చిదిద్దడం కోసం రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని యువత ప్రాణాలను కాపాడే విధంగా రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న అధికారులచే డ్రగ్స్ గాని గంజాయి గాని మాదకద్రవ్యాలు గాని ఎక్కడికక్కడ అంతరించబడే విధంగా ఉక్కుపాదం మోపాలని కోరారు. ప్రభుత్వం తరఫున అన్ని ప్రభుత్వ శాఖలకు కేటాయించబడుతున్న నిధులు వాటి ఖర్చు వాటి ఉపయోగాన్ని ఎప్పటికప్పుడు పసిగడుతూ ఆయా ప్రభుత్వ కార్యాలయాలు సిద్ధపరుస్తున్న ఆర్థిక లావాదేవీల నివేదికలను క్షుణ్ణంగా పరిశీలిస్తూ రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం నిధులను రక్షించాలని కోరారు.రాష్ట్ర ప్రభుత్వ శాఖలలో విచ్చలవిడి అవినీతి జరిగిపోతుందని రాష్ట్రవ్యాప్తంగా ప్రజలందరూ విమర్శలు గుప్పిస్తుండగా రాష్ట్రంలో జరుగుతున్న అవినీతిని నిర్మూలించటానికి అవసరమైతే రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రత్యేక చట్టాన్ని రూపొందించబడే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన సీనియర్ ఐఏఎస్ అధికారి సంజయ్ జాజు రాష్ట్రంలో దీర్ఘకాలికంగా పేరుకుపోయిన సమస్యలను పరిష్కరిస్తూనే నూతనంగా ఉద్భవిస్తున్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ప్రభుత్వ స్థాయిలో పరిష్కార మార్గాలను ఏర్పరుస్తూ రాష్ట్ర ప్రజలకు తెలంగాణ ప్రభుత్వం ద్వారా సుపరిచితమైన పాలన అందించబడే విధంగా దోహదపడాలని మనస్ఫూర్తిగా ఆశిస్తూ శుభాకాంక్షలు తెలియజేస్తున్నామన్నారు.

## ఎన్ఐటీ వరంగల్ వేదికగా గవర్నర్, మంత్రికి ఘన స్వాగతం పలికిన ఎర్రబెల్లి స్వర్ణ



**వరంగల్, 9 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**

వరంగల్ పర్యటనలో భాగంగా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ) వరంగల్‌కు విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా, అలాగే కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లకు తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లకు పుష్పగుచ్ఛాలు అందజేసి ఆత్మీయంగా అభివాదం చేశారు. రాష్ట్ర అభివృద్ధి, విద్యా రంగ పురోగతి, ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలులో ప్రభుత్వ కృషి ప్రశంసనీయమని పేర్కొంటూ కార్యక్రమం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యాసంస్థ ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# మంత్రి సీతక్కకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల సంఘం ప్రతినిధులు

**పంచాయతీ కార్యదర్శుల సమస్యల పరిష్కారానికి సహకారం అందించాలని విజ్ఞప్తి**

**హైదరాబాద్(జై భీమ్ న్యూస్)**

తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) గారి జన్మదినం సందర్భంగా తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల సంఘం ప్రతినిధులు ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో జరిగిన ఈ భేటీలో తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈర్లపల్లి శ్రీనివాస్,అధ్యక్షుడు పి. మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్కకు పుష్పగుచ్ఛం అందజేసి, ఆమె ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం గ్రామీణాభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శులు కీలక పాత్ర పోషిస్తున్నారని సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. గ్రామ పంచాయతీల సమర్థవంతమైన నిర్వహణ, ప్రజలకు మెరుగైన సేవలందించడంలో కార్యదర్శుల పాత్ర ఎంతో ముఖ్యమని తెలిపారు. వారి సమస్యల పరిష్కారం, సంక్షేమం, సేవా పరిస్థితుల మెరుగుదలకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుని, మంత్రి సీతక్క సహకారం అందించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా తనను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకులకు మంత్రి సీతక్క కృతజ్ఞతలు తెలిపారు. పంచాయతీ వ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, గ్రామీణాభివృద్ధి లక్ష్యాల సాధనలో కార్యదర్శుల సేవలు




ఎంతో విలువైనవని ఆమె పేర్కొన్నారు. ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రజాసంక్షేమం, గ్రామీణాభివృద్ధి, ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తుందని మంత్రి స్పష్టం చేశారు.

# ఆదివాసుల ఆణిముత్యానికి జన్మదిన శుభాకాంక్షలు





**బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం శ్రమిస్తున్న సీతక్క**
**మహిళా మంత్రిగా చిరస్మరణీయమైన సేవలందిస్తున్నారు.**
**ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న సీతక్క**
**మంత్రి సీతక్క నివాసంలో జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన డాక్టర్ బరిగెల శివ.**

**హైదరాబాద్(జై భీమ్ న్యూస్)**

కష్టజీవుల కష్టాల్లో తోడ్పాటు అందించే రాజకీయ నాయకులు ములుగు మన సభ్యులు రాష్ట్ర మంత్రి సీతక్క ఎప్పటికప్పుడు తన ప్రత్యేకతను చూపిస్తూ ఉంటారని డాక్టర్ బరిగెల శివ పేర్కొన్నారు.కరోనా సమయంలో వందలాది కార్యక్రమాలు చేసి ప్రజలను ఆదుకున్నారని తెలిపారు.గత ప్రభుత్వంలో వరంగల్ జిల్లాలో తుఫాను ఏర్పడినప్పుడు ములుగు ప్రాంతం నీటిమట్టంతో మునిగిపోగా ప్రజల ప్రాణాల కోసం బోరున విలపించి ప్రజల ప్రాణాలను రక్షించుకున్నారని తెలిపారు. ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ ప్రభుత్వంలో తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) ను గురువారం తన నివాసంలో ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి జై భీమ్ టీవీ ఫౌండర్, చైర్మన్ డాక్టర్ బరిగెల శివ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్కకు పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన డాక్టర్ బరిగెల శివ, ప్రజాసేవలో ఆమె చూపుతున్న అంకితభావం, గిరిజనులు, దళితులు, బడుగు--బలహీన వర్గాల అభ్యున్నతికి చేస్తున్న కృషిని అభినందించారు. మంత్రి సీతక్క సంపూర్ణ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ప్రజాసేవలో మరింత ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు, అభిమానులు కూడా మంత్రి సీతక్కకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాజా ఇన్ఫ్రా డెవలపర్స్ అధినేత ఎస్ఎస్ రాజ్ , రాజు తదితరులు పాలొగొన్నారు.

# ప్రకృతి వైద్యమే మానవాళి ఆరోగ్యానికి శాశ్వత ఆధారం







**కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం**

**కేయూ క్యాంపస్,09 జులై 2026 (జై భీమ్ న్యూస్)**

ప్రకృతిని సక్రమంగా వినియోగించుకుంటే ఎలాంటి వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యవంతమైన జీవితం గడపవచ్చని కాకతీయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం పేర్కొన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం రాజనీతి శాస్త్ర విభాగం అలుమ్నీ హాల్‌లో గురువారం నిర్వహించిన “విద్య -- వైద్యం అవగాహన కార్యక్రమం”కు డాక్టర్ సంకినేని వెంకట్ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ రామచంద్రం మాట్లాడుతూ ప్రకృతి మానవ ఆరోగ్యానికి అమూల్యమైన వరమని అన్నారు. ప్రకృతిలో లభించే వనరులను సమర్థవంతంగా వినియోగించుకుంటూ, ప్రతిరోజూ వ్యాయామం, నడక వంటి ఆరోగ్యకరమైన అలవాట్లను పాటిస్తే అనేక వ్యాధులను దూరం చేసుకోవచ్చని సూచించారు. ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని ప్రజల్లో ప్రోత్సహించేందుకు ప్రభుత్వాలు మరింత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ప్రధాన వక్తగా పాల్గొన్న ప్రకృతి వైద్య నిపుణులు డాక్టర్ కోటేశ్వరరావు మాట్లాడుతూ, ప్రకృతి వైద్యంపై సరైన అవగాహన లేకపోవడం వల్ల ప్రజలు చిన్న చిన్న అనారోగ్యాలకే ఖరీదైన మందులు, ప్రైవేట్ ఆస్పత్రులపై భారీగా ఖర్చు చేసి ఆర్థికంగా నష్టపోతున్నారని అన్నారు. ప్రకృతిలోనే అనేక రకాల ఔషధ గుణాలు ఉన్నాయని, వాటి వినియోగంపై అవగాహన పెంచుకుంటే ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు అనవసర వైద్య ఖర్చులను కూడా తగ్గించుకోవచ్చని పేర్కొన్నారు. మన జీవనశైలిని క్రమబద్ధీకరించుకోవడం, ప్రతిరోజూ నడక, వ్యాయామం చేయడం, శరీర శ్రమకు అలవాటు పడడం, చెట్లు, మొక్కల ఔషధ గుణాలను తెలుసుకోవడం ద్వారా అనేక జీవనశైలి వ్యాధులను నియంత్రించవచ్చని తెలిపారు. వంటింట్లోనే లభించే పసుపు, అల్లం, వెల్లుల్లి, మిరియాలు వంటి అనేక దినుసుల్లో ఔషధ గుణాలు ఉన్నప్పటికీ వాటి విలువను విస్మరించి మందులపై ఆధారపడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం 40 సంవత్సరాలు దాటిన వారిలో మధుమేహం, రక్తపోటు వంటి వ్యాధులు వేగంగా పెరుగుతున్నాయని, వీటిని నియంత్రించడంలో ప్రకృతి ఆధారిత జీవనశైలి, ఔషధ మొక్కలు కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. ప్రకృతిని పరిరక్షించడమే కాకుండా, ప్రకృతి ప్రసాదించిన ఆరోగ్య సంపదను సద్వినియోగం చేసుకుంటూ భావితరాలకు ఆరోగ్యవంతమైన సమాజాన్ని అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాజనీతి శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ గడ్డం కృష్ణయ్య, పీవీ నాలెడ్జ్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ వడ్లకొండ సత్యనారాయణ, తెలుగు విభాగాధిపతి డాక్టర్ మామిడి లింగయ్య, కేయూ పాలక మండలి సభ్యులు డాక్టర్ చిర్ర రాజు, డిప్సా అధ్యక్షులు డాక్టర్ నాగరాజు, డాక్టర్ రాధిక, సామాజిక కార్యకర్త బొడ్డు దయాకర్, రీసెర్చ్ స్కాలర్ అంకిల శంకర్, డాక్టర్ కల్లేపల్లి ప్రశాంత్‌తో పాటు అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వస్తువు పాడైతే కంపెనీలపై కేసు వేయొచ్చు

**వినియోగదారులకు చట్టం అండగా ఉంటుంది: డా. రాధాకృష్ణ గౌడ్**



**వరంగల్, 9 జూలై 2026(జై భీమ్ న్యూస్)**

కొనుగోలు చేసిన వస్తువులు పాడైపోవడం, సేవల్లో లోపాలు, ఆసుపత్రుల్లో వైద్య నిర్లక్ష్యం, బీమా (ఇన్సూరెన్స్) క్లెయిమ్‌లను అన్యాయంగా తిరస్కరించడం, రైతులకు నకిలీ విత్తనాలు, నకిలీ పురుగుమందులు విక్రయించడం వంటి అంశాలపై వినియోగదారులు కన్స్యూమర్ కమిషన్‌ను ఆశ్రయించి న్యాయం పొందే పూర్తి హక్కు కలిగి ఉన్నారని ది నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ చైర్మన్ డా. రాధాకృష్ణ గౌడ్ తెలిపారు. వినియోగదారుల రక్షణ చట్టం--2019 ప్రకారం వినియోగదారుల హక్కులు మరింత బలోపేతం అయ్యాయని ఆయన పేర్కొన్నారు. వారంటీ ఉన్నప్పటికీ మొబైల్ ఫోన్, టెలివిజన్, ఫ్రిజ్, వాషింగ్ మెషీన్ వంటి ఎలక్ట్రానిక్ వస్తువులు లేదా ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసిన ఉత్పత్తులు లోపభూయిష్టంగా ఉండి, కంపెనీలు మరమ్మతు చేయడానికి లేదా కొత్త వస్తువును అందించడానికి నిరాకరిస్తే సంబంధిత కంపెనీలపై కన్స్యూమర్ కమిషన్‌లో కేసు దాఖలు చేయవచ్చని తెలిపారు. రూ.5 లక్షల వరకు విలువైన వస్తువులు, సేవలకు సంబంధించిన వివాదాలపై కోర్టు ఫీజు లేకుండానే ఫిర్యాదు చేసేందుకు అవకాశం ఉందన్నారు. అలాగే ఈ - డాఖిల్ ద్వారా ఇంటి నుంచే ఆన్‌లైన్‌లో ఫిర్యాదు నమోదు చేసుకునే సౌకర్యం అందుబాటులో ఉందని చెప్పారు. వినియోగదారుడు నివసించే ప్రాంతంలోని జిల్లా కన్స్యూమర్ కమిషన్‌లోనే కేసు దాఖలు చేయవచ్చని వివరించారు. తయారీ లోపం వల్ల వినియోగదారుడికి ఆర్థిక, శారీరక లేదా మానసిక నష్టం కలిగితే వస్తువు ధరతో పాటు తగిన నష్టపరిహారం పొందే హక్కును చట్టం కల్పించిందని పేర్కొన్నారు. ఈ బాధ్యత విక్రేతతో పాటు తయారీదారుడిపైనా ఉంటుందని స్పష్టం చేశారు. క్లెయిమ్ విలువ ఆధారంగా జిల్లా కన్స్యూమర్ కమిషన్‌లో రూ.50 లక్షల వరకు, రాష్ట్ర కమిషన్‌లో రూ.50 లక్షల నుంచి రూ.2 కోట్ల వరకు, జాతీయ కమిషన్‌లో రూ.2 కోట్లకు పైబడిన కేసులపై విచారణ జరుగుతుందని తెలిపారు. తయారీ లోపాలున్న వస్తువుల విషయంలో సుప్రీంకోర్టు, జాతీయ కన్స్యూమర్ కమిషన్ వినియోగదారులకు అనుకూలంగా అనేక కీలక తీర్పులు ఇచ్చాయని గుర్తు చేశారు. కేసు దాఖలు చేసే ముందు సంబంధిత కంపెనీకి లీగల్ నోటీసు పంపితే అనేక సందర్భాల్లో కోర్టు వెలుపలే సమస్య పరిష్కారమయ్యే అవకాశం ఉంటుందని సూచించారు. కొనుగోలు బిల్లులు, వారంటీ కార్డులు, సర్వీస్ జాబ్ కార్డులు, చెల్లింపు రసీదులు వంటి అన్ని ఆధారాలను తప్పనిసరిగా భద్రంగా ఉంచుకోవాలని వినియోగదారులకు సూచించారు. వినియోగదారుల హక్కులు, ఫిర్యాదులు, చట్టపరమైన సలహాల కోసం ది నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ చైర్మన్ డా. రాధాకృష్ణ గౌడ్‌ను 73867 14457 నంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు.

# వరంగల్ కమిషనరేట్‌లో ఘనంగా ముగిసిన భద్రాద్రి జోనల్ పోలీస్ డ్యూటీ మీట్

**13 స్వర్ణ పతకాలతో సహా మొత్తం 28 పతకాలు సాధించిన వరంగల్ పోలీస్ కమిషనరేట్**



**వరంగల్, 9 జూలై 2026(జై భీమ్ క్రైమ్ న్యూస్)**

మూడు రోజుల పాటు వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో మామునూరు పోలీస్ శిక్షణ కేంద్రంలో నిర్వహించిన భద్రాద్రి జోనల్ పోలీస్ డ్యూటీ మీట్ గురువారం ఘనంగా ముగిసింది. ఈ పోటీల్లో వరంగల్, ఖమ్మం పోలీస్ కమిషనరేట్లతో పాటు మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన పోలీస్ అధికారులు పాల్గొని తమ వృత్తి నైపుణ్యాలను ప్రదర్శించారు. ఈ డ్యూటీ మీట్‌లో కంప్యూటర్ పరిజ్ఞానం, ఫోరెన్సిక్ సైన్స్, ఫింగర్ ప్రింట్స్ లిఫ్టింగ్ అండ్ ప్యాకింగ్, బాంబ్ డిస్పోజల్, డాగ్ స్క్వాడ్, ప్రొఫెషనల్ ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించారు. వివిధ విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పోలీస్ అధికారులకు వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ పతకాలు అందజేసి అభినందించారు. పోటీల్లో వరంగల్ పోలీస్ కమిషనరేట్ అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి 13 స్వర్ణ పతకాలతో పాటు మొత్తం 28 పతకాలను కైవసం చేసుకుంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా 12 పతకాలు, మహబూబాబాద్ జిల్లా 13 పతకాలు, ఖమ్మం పోలీస్ కమిషనరేట్ 9 పతకాలు సాధించాయి. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన అధికారులు త్వరలో మల్కాజిగిరి కమిషనరేట్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ ఎన్. శ్వేత మాట్లాడుతూ, డ్యూటీ మీట్‌లు పోలీసు సిబ్బందిలో వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. క్రమశిక్షణతో కూడిన కఠోర సాధన ద్వారా విధి నిర్వహణలో మరింత సమర్థత సాధించడంతో పాటు పని ఒత్తిడిని అధిగమించే సామర్థ్యం పెరుగుతుందని పేర్కొన్నారు. జోనల్ స్థాయిలో చూపిన ప్రతిభను రాష్ట్ర, జాతీయ స్థాయిల్లోనూ కొనసాగించి మరిన్ని విజయాలు సాధించాలని పోలీస్ అధికారులను ఆమె ప్రోత్సహించారు. పోటీలను విజయవంతంగా నిర్వహించిన పోలీస్ అధికారులు, సిబ్బందిని కమిషనర్ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో అదనపు డీసీపీలు శ్రీనివాస్, బాలస్వామి, ఏసీపీ సురేంద్ర, డీఎస్పీలు శ్రీనివాస్, సాంబరాజు, ఆర్ఐ సతీష్, ఇన్‌స్పెక్టర్లు క్రాంతికుమార్, విశ్వేశ్వర్, ఎస్ఐ విజయ్‌కుమార్, ఆర్ఎస్ఐ శ్రవణ్‌కుమార్‌తో పాటు పలువురు పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



జై భీమ్ తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE

# వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో రూ.4.31 కోట్ల విలువైన 862 కిలోల గంజాయి దగ్ధం

**వరంగల్, 9 జూలై 2026(జై భీమ్ న్యూస్)**

హైదరాబాద్‌లోని తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ డైరెక్టర్ ఆదేశాల మేరకు, డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో స్వాధీనం చేసుకున్న భారీ మొత్తంలో గంజాయిని గురువారం శాస్త్రీయ పద్ధతిలో దగ్ధం చేశారు. కమిషనరేట్ పరిధిలో నమోదైన మొత్తం 86 గంజాయి కేసుల్లో పోలీసులు స్వాధీనం చేసుకున్న 862 కిలోల గంజాయిని, సుమారు రూ.4 కోట్ల 31 లక్షల విలువైన మాదకద్రవ్యాన్ని హనుమకొండ జిల్లా అమ్మవారిపేటలోని కాకతీయ మెడిక్లీన్ సర్వీసెస్ వద్ద ఇన్సినరేషన్ (దగ్ధం) విధానంలో పూర్తిగా నాశనం చేశారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో భాగంగా కోర్టు అనుమతులు, నిబంధనలను పాటిస్తూ డ్రగ్ డిస్పోజల్ కమిటీ పర్యవేక్షణలో ఈ ప్రక్రియ నిర్వహించబడింది. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగాన్ని అరికట్టేందుకు తెలంగాణ పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నారని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డ్రగ్ డిస్పోజల్ కమిటీ చైర్మన్, డీసీపీ ఈస్ట్ జోన్ శ్రీ అంకిత్ కుమార్ సంక్వార్, ఐపీఎస్, అదనపు డీసీపీ ప్రభాకర్ రావు, ఏసీపీ సీసీఆర్‌బీ పి. డేవిడ్ రాజు, ఇన్‌స్పెక్టర్లు సంజీవరావు, ఎస్ఐ నరేష్తో పాటు ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు. పోలీసులు మాదకద్రవ్యాలపై తమ ప్రత్యేక నిఘాను మరింత



బలోపేతం చేస్తూ, యువతను డ్రగ్స్ బారిన పడకుండా కాపాడేందుకు అవగాహన కార్యక్రమాలతో పాటు అక్రమ రవాణాదారులపై కఠిన చర్యలు కొనసాగిస్తామని పేర్కొన్నారు.

# మిషన్ భగీరథ నీటి సరఫరాకు అంతరాయం

**30 గంటలకు పైగా తాగునీటి సరఫరా నిలిపివేత**
**హుజూరాబాద్, హుస్నాబాద్, మానకొండూరు నియోజకవర్గాల ప్రజలు ముందుగానే నీటిని నిల్వ చేసుకోవాలని సూచన**




**హుజూరాబాద్, 9 జూలై 2026 (జైభీమ్ న్యూస్)**

ఎల్ఎండీ ఇన్‌టేక్ వెల్‌లో వరంగల్‌కు సంబంధించిన మోటార్ల మరమ్మత్తు పనులు చేపడుతున్న నేపథ్యంలో హుజూరాబాద్, హుస్నాబాద్, మానకొండూరు నియోజకవర్గాల పరిధిలోని అన్ని మండలాలు, మున్సిపాలిటీలలో మిషన్ భగీరథ తాగునీటి సరఫరాకు తాత్కాలిక అంతరాయం ఏర్పడనుంది. ఈ మేరకు మిషన్ భగీరథ హుజూరాబాద్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జె. రామ్ కుమార్ గురువారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. జూలై 10 మధ్యాహ్నం 1:00 గంటల నుంచి జూలై 11 సాయంత్రం 7:00 గంటల వరకు తాగునీటి సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. మరమ్మత్తు పనులు పూర్తయిన వెంటనే సాధారణ తాగునీటి సరఫరాను పునరుద్ధరిస్తామని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా అవసరమైన మేరకు ముందుగానే తాగునీటిని నిల్వ చేసుకోవాలని సూచించారు. అలాగే, సరఫరా పునరుద్ధరించే వరకు గ్రామ పంచాయతీలు, స్థానిక సంస్థలు అందుబాటులో ఉంచిన ప్రత్యామ్నాయ తాగునీటి వనరులను వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. మరమ్మత్తు పనుల కారణంగా తలెత్తే తాత్కాలిక అసౌకర్యానికి ప్రజలు సహకరించాలని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జె. రామ్ కుమార్ కోరారు.

# జూలై 10 విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలి

**ప్రభుత్వ పాఠశాలల మూసివేత నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలి: పీడీఎస్‌యూ జిల్లా నాయకులు**




**హన్మకొండ, 9 జూలై 2026 (జైభీమ్ న్యూస్)**

రాష్ట్రంలో విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని, ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ జూలై 10న విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) హనుమకొండ జిల్లా నాయకులు విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం హనుమకొండ నక్కలగుట్టలోని జార్జ్ రెడ్డి భవన్‌లో పీడీఎస్‌యూ జిల్లా కార్యవర్గం ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు వంశీకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి రాచకొండ రంజిత్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయాల్సిన సమయంలో ప్రభుత్వ పాఠశాలలను మూసివేసే దిశగా అడుగులు వేయడం అత్యంత బాధాకరమని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం సుమారు 27 వేల ప్రభుత్వ పాఠశాలలను మూసివేసి కేవలం నాలుగు వేల పాఠశాలలను మాత్రమే నిర్వహిస్తామని ప్రకటించడం విద్యా హక్కుపై తీవ్ర ప్రభావం చూపే నిర్ణయమని అన్నారు. ఇది గ్రామీణ, పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లల విద్యకు తీవ్ర నష్టం కలిగించే చర్య అని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలు సామాన్య ప్రజల పిల్లలకు నాణ్యమైన విద్య అందించే కేంద్రాలని, వాటిని మూసివేయడం వల్ల వేలాది మంది విద్యార్థులు చదువుకు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వం విద్యా రంగాన్ని అభివృద్ధి చేయడానికి బదులుగా ప్రభుత్వ పాఠశాలలను క్రమంగా నిర్వీర్యం చేసే కుట్రకు పాల్పడుతోందని ఆరోపించారు. ఈ నిర్ణయం ప్రజా విద్యను బలహీనపరచి, కార్పొరేట్ విద్యాసంస్థలకు ప్రోత్సాహం కల్పించేలా ఉందని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకుని ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంతో పాటు ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని, మౌలిక వసతులను మెరుగుపరచాలని, విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం జూలై 10న విద్యార్థి సంఘాలు చేపట్టిన విద్యాసంస్థల బంద్‌కు ప్రతి విద్యార్థి, ఉపాధ్యాయుడు, విద్యాభిమానులు, ప్రజాసంఘాలు సంపూర్ణ మద్దతు తెలపాలని కోరారు. ప్రభుత్వం తమ డిమాండ్లను పట్టించుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా మరింత ఉధృతమైన ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో జిల్లా నాయకులు ముషరాఫ్, డానియల్, యుగేందర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

# ఐటీ కంపెనీల్లో కార్ల అటాచ్‌మెంట్ పేరుతో భారీ మోసం

**ఇద్దరు అరెస్ట్.. మూడు కార్లు, మొబైల్ ఫోన్ స్వాధీనం**





**వరంగల్, 9 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**

ఐటీ కంపెనీల్లో కార్లను అటాచ్‌మెంట్ చేసి ప్రతి నెలా అధిక అద్దె ఇప్పిస్తామని వాహన యజమానులను నమ్మించి కార్లు తీసుకుని, వాటిని ఇతరుల వద్ద తాకట్టు పెట్టి లక్షల రూపాయలు కాజేసిన ముఠాకు చెందిన ఇద్దరు నిందితులను వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఏ.జే. మిల్స్ కాలనీ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి మూడు కార్లు, ఒక మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, బాధితుడు మొహమ్మద్ సోహైల్‌కు చెందిన మారుతి డిజైర్ కారును నెలకు రూ.35 వేల అద్దె వస్తుందని నమ్మించిన ప్రధాన నిందితుడు సింగారపు శ్యామ్ కుమార్ మొదట అడ్వాన్స్‌గా రూ.35 వేలు చెల్లించి కారును తీసుకున్నాడు. అనంతరం ఆ వాహనాన్ని ఇతరుల వద్ద తాకట్టు పెట్టి, బాధితుడికి అద్దె చెల్లించకుండా మోసానికి పాల్పడ్డాడు. ఇదే విధానంలో మరికొంత మంది వాహన యజమానులను కూడా మోసం చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ నెల 9న తెలంగాణ జంక్షన్ వద్ద నిర్వహించిన వాహన తనిఖీల్లో అనుమానాస్పదంగా సంచరిస్తున్న సింగారపు శ్యామ్ కుమార్ (ఏ1), ఎం.డి. సోహైల్ (ఏ2)లను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించారు. వారి వద్ద నుంచి ఒక మారుతి డిజైర్ కారును స్వాధీనం చేసుకోగా, నిందితులు ఇచ్చిన సమాచారం మేరకు చింతల్ ఫ్లైఓవర్ కింద దాచిపెట్టిన మరో రెండు కార్లు (మారుతి ఎర్టిగా, మారుతి బలెనో)తో పాటు నేరాలకు ఉపయోగించిన హెచ్ఎమ్‌డీ కీప్యాడ్ మొబైల్ ఫోన్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు సింగారపు శ్యామ్ కుమార్ గతంలో కూడా ఇలాంటి మోసాలకు పాల్పడినట్లు విచారణలో తేలిందని పోలీసులు తెలిపారు. అతనిపై చెన్నారావుపేట, ఇంటేజార్‌గంజ్, ఏ.జే. మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్లలో ఇప్పటికే పలు కేసులు నమోదై ఉన్నాయని వెల్లడించారు. ఈ కేసులో పరారీలో ఉన్న ఇతర నిందితుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని, ఇంకా మోసపోయిన బాధితులను గుర్తించడం, మిగిలిన వాహనాలను స్వాధీనం చేసుకోవడం, డిజిటల్ మరియు ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన ఆధారాలను సేకరించడం వంటి అంశాలపై దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు. అరెస్టు చేసిన ఇద్దరు నిందితులను గౌరవ న్యాయస్థానంలో హాజరుపరచగా, కోర్టు వారిని జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపినట్లు ఏ.జే. మిల్స్ కాలనీ పోలీసులు వెల్లడించారు.

# ఓటీపీ వాలిడిటీని వారం రోజులకు పెంచండి.. కె రాజిరెడ్డి

**వికారాబాద్ జిల్లా జై భీమ్ న్యూస్:**



యూరియా బుకింగ్ ఓటీపీ వాలిడిటీ నీ వారం రోజులకు పెంచాలని దోమ మండల సర్పంచుల సంగం మాజీ అధ్యక్షులు కె రాజిరెడ్డి రాష్ట్ర వ్యవసాయ శాఖ ను కోరారు. రైతులు మీసేవ ద్వారా యూరియా బుకింగ్ చేసుకోవచ్చని ఓటీపీ వాలిడిటీ రెండు రోజులు మాత్రమే ఉంటుంది అని, వ్యవసాయ శాఖ అధికారులు స్పష్టం చేసిన నేపత్యంలో ఫర్టిలైజర్ డీలర్ దగ్గర యూరియా నిల్వలు అందుబాటులో లేకుంటే రైతు ఏం చేయాలి, మళ్ళీ మీ సేవకు రైతు వెళ్లి మళ్ళీ బుక్ చేసుకోవాలి గట్ల మీద ఉండాల్సిన రైతు రోడ్ల మీద తిరగాల్సి వస్తుంది. మీ సేవలో రైతుకు అప్లికేషన్ రుసుము లేకుండా ఎరువులు బుక్ చేసే విదంగా ప్రభుత్వం చొరవ తీసుకోవాలి, రబి లో యాప్ బుకింగ్ ద్వారా వారం వరకు కూడా యూరియా దొరకక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిర్వాహకం తో గత రెండున్నర ఏళ్ళ నుండి రైతులకు ఎరువుల లభ్యతలో తీవ్ర ఇబ్బందులు ఉన్నాయని అన్నారు.

# టీజీ సీపీజెట్-2026 రెండో రోజు పరీక్షలు ప్రశాంతం

**నేడు జర్నలిజం సహా నాలుగు పీజీ కోర్సులకు ప్రవేశ పరీక్షలు**

**హన్మకొండ, 9 జూలై 2026(జై భీమ్ న్యూస్)**

తెలంగాణ రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న టీజీ సీపీజెట్--2026 ఆన్‌లైన్ (కంప్యూటర్ ఆధారిత) ప్రవేశ పరీక్షలు రెండో రోజు ప్రశాంతంగా, విజయవంతంగా ముగిశాయని కన్వీనర్ ఆచార్య రాజేందర్ కట్ల తెలిపారు. గురువారం నిర్వహించిన పరీక్షల్లో ఉదయం సెషన్‌లో ఎం.ఏ. ఎకనామిక్స్ కోర్సుకు 1,384 మంది అభ్యర్థులు నమోదు చేసుకోగా, వారిలో 1,143 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం సెషన్‌లో ఎం.ఏ. తెలుగు కోర్సుకు 2,946 మంది అభ్యర్థులు నమోదు చేసుకోగా, 2,486 మంది పరీక్ష రాశారు. సాయంత్రం సెషన్‌లో నిర్వహించిన ప్రవేశ పరీక్షకు 1,233 మంది అభ్యర్థులు నమోదు చేసుకోగా, 1,048 మంది హాజరైనట్లు ఆయన తెలిపారు. పరీక్షల నిర్వహణలో భాగంగా కాకతీయ విశ్వవిద్యాలయం అధికారులు వివిధ పరీక్షా కేంద్రాలను సందర్శించి పరీక్షల నిర్వహణ తీరును, అభ్యర్థులకు కల్పించిన సౌకర్యాలను, కేంద్రాల్లో చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించారు. అన్ని కేంద్రాల్లో ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పరీక్షలు విజయవంతంగా నిర్వహించినట్లు కన్వీనర్ ఆచార్య రాజేందర్ కట్ల వెల్లడించారు. జూలై 10న ఎం.ఏ. జర్నలిజం, ఎం.పీ.ఎడ్., ఎం.టి.ఎం., ఎం.ఎస్సి. జియో ఇన్ఫర్మాటిక్స్ కోర్సుల ప్రవేశ పరీక్షలు షెడ్యూల్ ప్రకారం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. అభ్యర్థులు నిర్ణీత సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకుని, హాల్ టికెట్‌తో పాటు అవసరమైన గుర్తింపు పత్రాలను వెంట తీసుకువచ్చి పరీక్షలకు హాజరుకావాలని సూచించారు.

# భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా దంపతులు

**వేదాశీర్వచనం, ప్రత్యేక పూజలు.. అమ్మవారి తైలవర్ణ చిత్రపటం బహూకరణ**

**వరంగల్, 9 జూలై 2026(జై భీమ్ న్యూస్)**





వరంగల్ మహానగరంలోని చారిత్రక ప్రసిద్ధి చెందిన శ్రీ భద్రకాళి అమ్మవారి దేవస్థానాన్ని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా దంపతులు గురువారం సాయంత్రం భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న గవర్నర్ దంపతులకు దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ ఎం. హనుమంతరావు, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, వరంగల్ జిల్లా కలెక్టర్ డా. సత్యశారదా దేవి, దేవాదాయ ధర్మాదాయ శాఖ వరంగల్ జోన్ డిప్యూటీ కమిషనర్ కృష్ణప్రసాద్, ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈఓ) రామల సునీత, ప్రధానార్చకులు భద్రకాళి శేషు, వేదపండితులు, అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం గవర్నర్ దంపతులు ఆలయ గోశాలలో గోవులకు గోగ్రాసం అందించి, శంకరాచార్యులు, వల్లభ గణపతిని దర్శించుకున్నారు. ధ్వజస్తంభం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయంలోకి ప్రవేశించి అమ్మవారికి దీపారాధన చేశారు. ఈ సందర్భంగా శ్రీ భద్రకాళి అమ్మవారికి విశేష పూజలు, కుంకుమార్చనలు నిర్వహించగా, గవర్నర్ దంపతులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. తదనంతరం ఆలయ ప్రాంగణంలోని శివాలయంలో శ్రీ భద్రేశ్వర స్వామిని దర్శించుకుని అభిషేక కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం దేవాలయ మహామండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా, గవర్నర్ దంపతులకు అమ్మవారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలను ఆలయ అధికారులు అందజేశారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ కమిషనర్ ఎం. హనుమంతరావు, వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు, ఆలయ ఈఓ రామల సునీత కలిసి శ్రీ భద్రకాళి అమ్మవారి తైలవర్ణ చిత్రపటాన్ని గవర్నర్ శివప్రతాప్ శుక్లాకు బహూకరించారు. చిత్రపటాన్ని అందుకున్న గవర్నర్ హర్షం వ్యక్తం చేస్తూ ఆలయ అధికారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిషోర్, జిల్లా పోలీసు శాఖ అధికారులు, రెవెన్యూ అధికారులు, దేవాదాయ శాఖ అధికారులు, వేదపండితులు, అర్చకులు తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

# మహాత్మ జ్యోతిరావు పూలే నగర్‌లో సీపీఎం అధ్యయన సర్వే

**రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్**

**హన్మకొండ, 9 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) సీపీఎం హనుమకొండ సౌత్ మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం 31వ డివిజన్ పరిధిలోని మహాత్మ జ్యోతిరావు పూలే నగర్‌లో స్థానిక సమస్యలపై అధ్యయన సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం హనుమకొండ సౌత్ మండల కార్యదర్శి మంద సంపత్ మాట్లాడుతూ, గత పదేళ్లుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన పేద కుటుంబాలు ఈ కాలనీలో పక్కా ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్నప్పటికీ, కనీస మౌలిక వసతులు కల్పించడంలో నగర పాలక సంస్థ ప్రజాప్రతినిధులు, అధికారులు పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. కాలనీవాసులు ఎన్నో ఏళ్లుగా ఇంటి పన్ను, నీటి పన్ను, విద్యుత్ బిల్లులు క్రమం తప్పకుండా ప్రభుత్వానికి చెల్లిస్తున్నప్పటికీ, రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి పైపులైన్లు, మిషన్ భగీరథ తాగునీటి వంటి ప్రాథమిక సౌకర్యాలు అందించడంలో వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. ప్రతి సంవత్సరం నగరాభివృద్ధి పేరుతో కేటాయించే నిధులు వెనుకబడిన ప్రాంతాలకు అందడం లేదని, ఎమ్మెల్యే నిధులు, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో కూడా కాలనీలో అభివృద్ధి పనులు చేపట్టలేదని పేర్కొన్నారు. అలాగే స్వచ్ఛ భారత్ వంటి పథకాల కింద భారీగా నిధులు వచ్చినప్పటికీ వాటి ఫలితాలు ఈ ప్రాంత ప్రజలకు అందలేదని విమర్శించారు. కొన్ని అభివృద్ధి చెందిన కాలనీల్లో ఇప్పటికే ఉన్న రోడ్లపైనే మళ్లీ రోడ్లు వేయడం, నిర్మించిన డ్రైనేజీలను తిరిగి పునర్నిర్మించడం జరుగుతుండగా, వెనుకబడిన కాలనీల్లో మాత్రం కనీస మౌలిక వసతులు కూడా లేకపోవడం ప్రభుత్వాల నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆయన అన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో కాలనీలోని రహదారులు బురదమయంగా మారి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ద్విచక్ర, త్రిచక్ర, నాలుగు చక్రాల వాహనాల రాకపోకలు దాదాపు అసాధ్యంగా మారాయని తెలిపారు. చెత్తాచెదారం పేరుకుపోవడంతో రాత్రివేళల్లో విషపురుగుల సంచారం పెరిగి ప్రజలు



భయాందోళనలకు గురవుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం, నగర పాలక సంస్థ వెంటనే స్పందించి రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సౌకర్యాలతో పాటు కాలనీలోని ఇతర సమస్యలను అత్యవసరంగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే ప్రజలతో కలిసి ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ సౌత్ మండల కమిటీ సభ్యులు ఇస్లావత్ రవీందర్, జగనాల ఉప్పలయ్య, ఎస్కే లతీఫ్, దూడపాక రాజేందర్, నేతకాని రమాదేవి, మహేందర్, భారతి, రజిత, రేణుక, సుగుణ, సరిత తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ పోలీస్ గేమ్స్‌లో వరంగల్ మహిళా బాక్సర్ మెట్టుపల్లి సౌజన్యకు కాంస్య పతకం

**రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ చాటిన పోలీసు క్రీడాకారిణి**
**వరంగల్‌కు మరోసారి కీర్తి తెచ్చిన సౌజన్య**



**హైద్రాబాద్, 9 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**

తెలంగాణ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలో జూలై 7 నుంచి 9 వరకు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన 5వ తెలంగాణ పోలీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్--2026లో వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు చెందిన మహిళా పోలీసు బాక్సర్ మెట్టుపల్లి సౌజన్య అద్భుత ప్రతిభ కనబర్చి మహిళల బాక్సింగ్ విభాగంలో కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. రాష్ట్ర స్థాయి పోటీల్లో వరంగల్‌కు మరోసారి కీర్తి తీసుకువచ్చిన ఆమె విజయంపై పోలీసు శాఖతో పాటు క్రీడా వర్గాల్లో హర్షాతిరేకం వ్యక్తమవుతోంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వివిధ పోలీస్ కమిషనరేట్లు, జిల్లా పోలీసు యూనిట్లు, ప్రత్యేక విభాగాలకు చెందిన వందలాది మంది పోలీసు క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. బాక్సింగ్, అథ్లెటిక్స్, వాలీబాల్, కబడ్డీ, షూటింగ్ తదితర విభాగాల్లో అత్యంత ఉత్కంఠభరితంగా పోటీలు జరిగాయి. మహిళల బాక్సింగ్ విభాగంలో మెట్టుపల్లి సౌజన్య అసాధారణ పోరాట పటిమ, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణతో వరుస విజయాలు నమోదు చేసి మూడో స్థానాన్ని దక్కించుకుని కాంస్య పతకాన్ని సాధించింది. పోటీల ముగింపు సందర్భంగా నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవంలో తెలంగాణ పోలీస్ శాఖ ఉన్నతాధికారులు సౌజన్యకు కాంస్య పతకంతో పాటు ప్రశంసాపత్రాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు. విధి నిర్వహణతో పాటు క్రీడల్లోనూ అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఆమెను అభినందిస్తూ, క్రీడాస్ఫూర్తి, అంకితభావం, క్రమశిక్షణకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. హన్మకొండ జిల్లా కమలాపూర్ మండలం అంబాల గ్రామానికి చెందిన మెట్టుపల్లి స్వరూప--రమేష్ దంపతుల చిన్న కుమార్తె అయిన సౌజన్య ప్రస్తుతం వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో విధులు నిర్వహిస్తోంది. చిన్ననాటి నుంచే బాక్సింగ్‌పై ఆసక్తిని పెంచుకున్న ఆమె, కఠోర సాధనతో రాష్ట్ర స్థాయిలో పతకం సాధించి తన ప్రతిభను మరోసారి నిరూపించుకుంది. సౌజన్య సాధించిన ఈ విజయం వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కే కాకుండా హన్మకొండ జిల్లా ప్రజలకు గర్వకారణంగా నిలిచింది. మహిళా పోలీసు సిబ్బందిలో క్రీడల పట్ల మరింత ఉత్సాహాన్ని నింపే విజయంగా అధికారులు పేర్కొన్నారు. ఆమెను సహచర పోలీసు సిబ్బంది, ఉన్నతాధికారులు, క్రీడాకారులు, గ్రామస్తులు, స్నేహితులు అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీల్లోనూ పాల్గొని తెలంగాణ పోలీస్ శాఖకు మరిన్ని పతకాలు సాధించి రాష్ట్రానికి మరింత గౌరవం తీసుకురావాలని అందరూ ఆకాంక్షించారు. రాష్ట్ర స్థాయి పోలీస్ క్రీడల్లో వరంగల్ మహిళా క్రీడాకారిణి సాధించిన ఈ కాంస్య పతకం జిల్లా క్రీడా చరిత్రలో మరో గర్వకారణంగా నిలవడమే కాకుండా యువతలో క్రీడల పట్ల ఆసక్తి, స్ఫూర్తిని పెంపొందించే విజయంగా పలువురు అభిప్రాయపడ్డారు.




## తెలంగాణ డీజీపీకి బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడి బహిరంగ లేఖ

**'మత్తు' నుంచి రాష్ట్రాన్ని కాపాడండి.. డ్రగ్స్ నిర్మూలనకు కఠిన చర్యలు తీసుకోండి : బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రాం శేఖర్**

**హైద్రాబాద్, 9 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**

రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్, ఇతర మాదకద్రవ్యాల వినియోగం రోజు రోజుకు పెరుగుతూ యువతతో పాటు సమాజాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తూ, తెలంగాణ డీజీపీకి బీఎస్పీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రాం శేఖర్ బహిరంగ లేఖ రాశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు చిన్నా పెద్దా అనే తేడా లేకుండా అన్ని వర్గాల ప్రజలను ప్రభావితం చేస్తున్నాయని పేర్కొన్నారు. పట్టణాల నుంచి పల్లెల వరకు మత్తు పదార్థాలు సులభంగా లభిస్తున్నాయనే వార్తలు తరచూ వెలుగులోకి వస్తున్నాయని అన్నారు. విదేశాల నుంచి, ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా మాదకద్రవ్యాలు రాష్ట్రంలోకి ప్రవేశిస్తున్నాయని, అలాగే రాష్ట్రంలోనే రహస్యంగా గంజాయి సాగు జరుగుతున్నట్లు వస్తున్న సమాచారం ఆందోళన కలిగిస్తోందన్నారు. డ్రగ్స్‌ను సరఫరా చేసే ముఠాలు, వాటిని వినియోగించే వారి కారణంగా సమాజంలో నేరాలు, హింస, కుటుంబ సమస్యలు పెరుగుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. చాపకింద నీరులా విస్తరిస్తున్న డ్రగ్స్ సంస్కృతిని అరికట్టేందుకు పోలీసు శాఖ మరింత కఠిన చర్యలు చేపట్టాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం, ముఖ్యంగా పోలీసు శాఖ ప్రతి పాఠశాల, కళాశాల, విశ్వవిద్యాలయం, సాఫ్ట్‌వేర్ కంపెనీలు, పరిశ్రమల్లో విద్యార్థులు, యువత, ప్రజలకు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే చట్టపరమైన శిక్షలు, ఆరోగ్యపరమైన ప్రమాదాలపై ప్రజలకు స్పష్టమైన సమాచారం అందించాలని కోరారు. అదేవిధంగా గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలను అక్రమంగా సరఫరా చేసే వారిపై వారి హోదా, పలుకుబడితో సంబంధం లేకుండా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని, రాష్ట్రాన్ని మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడాలని తెలంగాణ డీజీపీని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రాం శేఖర్ తన బహిరంగ లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు.

## తెలంగాణ గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన కాకతీయ విశ్వవిద్యాలయ ఉపకులపతి

**హన్మకొండ, 9 జూలై 2026(జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ కె. ప్రతాప్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర గవర్నర్‌ను రాజ్‌భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి. రామచంద్రం కూడా ఆయన వెంట ఉన్నారు. ఈ భేటీలో విశ్వవిద్యాలయ విద్యా, పరిపాలనా, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన పలు అంశాలపై చర్చించినట్లు తెలిసింది. కాకతీయ విశ్వవిద్యాలయంలో అమలవుతున్న విద్యా కార్యక్రమాలు, పరిశోధన, మౌలిక వసతుల అభివృద్ధి, విద్యార్థుల సంక్షేమానికి చేపడుతున్న చర్యల గురించి ఉపకులపతి గవర్నర్‌కు వివరించినట్లు సమాచారం. విశ్వవిద్యాలయం సమగ్ర అభివృద్ధికి చేపట్టాల్సిన భవిష్యత్ కార్యాచరణపై కూడా ఈ సందర్భంగా చర్చ జరిగినట్లు విశ్వవిద్యాలయ వర్గాలు వెల్లడించాయి. ఈ భేటీ సానుకూల వాతావరణంలో కొనసాగిందని అధికారులు తెలిపారు.



## వంగపహాడ్ ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకున్న ఎర్త్ ఫౌండేషన్

**విద్య, ఆరోగ్యం, నైపుణ్యాభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమాలు**
**కంప్యూటర్, సైన్స్ ల్యాబ్, స్పోకెన్ ఇంగ్లీష్‌పై దృష్టి**






**హన్మకొండ, 9 జూలై 2026(జై భీమ్ న్యూస్)**

హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండలం వంగపహాడ్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాలలను ఎర్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దత్తత తీసుకుంటూ ప్రత్యేక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మండల విద్యాధికారి (ఎంఈఓ) శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్య, ఆరోగ్యం, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో విద్యార్థులకు నాణ్యమైన సేవలు అందించేందుకు ఫౌండేషన్ తన కార్యాచరణను ప్రకటించింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న మండల విద్యాధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు కళలు, ఆరోగ్యం, వ్యక్తిత్వ వికాసం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించడం ద్వారా వారి భవిష్యత్తు మరింత మెరుగుపడుతుందని పేర్కొన్నారు. ఎర్త్ ఫౌండేషన్ కంప్యూటర్ విద్య, సైన్స్ ల్యాబ్, స్పోకెన్ ఇంగ్లీష్, మోటివేషన్ కార్యక్రమాలు చేపట్టడం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ఎర్త్ ఫౌండేషన్ డైరెక్టర్ వెన్నెల మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు వారి సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి అవసరమైన సేవలను నిరంతరం కొనసాగిస్తామని చెప్పారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించే కార్యక్రమాలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణలు, ఆధునిక విద్యా సదుపాయాల కల్పనపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నట్లు వెల్లడించారు. ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుజాత మాట్లాడుతూ తమ పాఠశాలను దత్తత తీసుకుని విద్యార్థుల అభివృద్ధిలో భాగస్వాములవుతున్న ఎర్త్ ఫౌండేషన్ కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ మాట్లాడుతూ ఆటవస్తువులు అందించడంతో పాటు వాలంటీర్‌ను నియమించి విద్యార్థుల అభివృద్ధికి సహకరిస్తుండడం సంతోషకరమని పేర్కొన్నారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో ప్రారంభించిన ప్రీ-ప్రైమరీ తరగతిని మండల విద్యాధికారి శ్రీనివాస్ ప్రారంభించి చిన్నారులతో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మన ఊరు--మన బడి నియోజకవర్గ కన్వీనర్ దోమకుమార్, ఉన్నత పాఠశాల మరియు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, ఎర్త్ ఫౌండేషన్ కోఆర్డినేటర్ రాజు, డాన్స్ మాస్టర్ కుమార్, వాలంటీర్ శృతి, ఫౌండేషన్ ప్రతినిధులు, గ్రామస్థులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

**నిజాజామాబాద్,జూలై9(జై భీమ్ న్యూస్):**

నిజామాబాద్ నగరంలోని వినాయక నగర్ ప్రాంతంలో ఓ వ్యక్తి తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం వెలుగు చూసింది. స్థానిక పాత హౌసింగ్ బోర్డ్ కాలనీలో నివాసముండే ఎం జగదీష్ (60) అనే వ్యక్తి గత రెండు రోజులుగా ఇంటి తలుపులు తెరవకపోవడంతో ఇంట్లోంచి దుర్వాసన వస్తుందని స్థానికులు తెలిపారు. ఈ విషయాన్ని చుట్టుపక్కల వారు డయల్ 100కు ఫోన్ చేసి సమాచామందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు.పాత హౌసింగ్ బోర్డ్ కాలనీలోని, బ్లాక్ నెంబర్ 13/2లో పై అంతస్తులు ఉండే జగదీష్ ఇంటి తలుపులను లోబడి నుండి పెట్టుకొని ఉండడంతో పోలీసులు స్థానికుల సహాయంతో డోర్లను తెరిచి చూశారు. ఆ ఇంట్లో మొదటి గదిలో ఆయన ఫ్యాన్ కు ఉరివేసుకొని వేలాడుతూ ఉండడాన్ని పోలీసులు గుర్తించారు. మృతుడి భార్య గత కొంత గీతం చనిపోవడం, అప్పటినుండి ఆయన ఇంట్లో ఒంటరిగానే ఉంటున్నట్లు చుట్టుపక్కల వారు తెలిపారు. ఆయన ఆత్మహత్యకు పాల్పడిన విషయాన్ని మృతుడి తమ్ముడైన మహేందర్‌కు పోలీసులు ఫోన్ చేసి సమాచారమందించారు. అయితే ఇంట్లో ఒంటరిగా ఉంటున్న ఆయన ఆత్మహత్యకు పాల్పడాల్సిన అవసరం ఏమిటన్న విషయం తెలియ రాలేదు. మృతుడి తమ్ముడి ఫిర్యాదు మేరకు నాలుగో టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం నిజామాబాద్ జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## 11న ట్రస్ట్ బోర్డు ప్రమాణ స్వీకారం

**యాదగిరిగుట్ట,జూలై9(జై భీమ్ న్యూస్):**

ఈనెల 11న యాదగిరిగుట్ట ట్రస్ట్ బోర్డు ప్రమాణ స్వీకారం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో భవాని శంకర్ వెల్లడించారు. గురువారం ఈవో కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. తిరుమల తరహాలో ఆలయంలోని బంగారు వాకిలి వద్ద ఉదయం 11 .37 గంటలకు ప్రమాణ స్వీకారం ఉంటుందన్నారు. అనంతరం ప్రెసిడెంట్ సూట్‌లో ట్రస్ట్ బోర్డ్ మొదటి సమావేశం జరుగుతుందని వివరించారు. ఆలయ ట్రస్ట్ చైర్మన్‌గా ఎం సత్యనారాయణ రెడ్డి , మరో ముగ్గురు సభ్యులు, ఎక్స్ అఫీషియో సభ్యుల ప్రమాణ స్వీకారం ఉంటుందన్నారు. ఈ ప్రమాణ స్వీకారానికి మీడియాకు అనుమతి లేదన్నారు. స్వీకారో త్సవం నిరాడంబరంగానే కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులకు ఎవరికి ఆహ్వానం అందజేయలేదని ఈవో వెల్లడించారు. ఒకవైపు దేవస్థానం అధికారులు ఆహ్వాన పత్రికను వీఐపీలకు అందజేస్తూనే మరోవైపు ఎవరికి ఆహ్వానం లేదనడంపై విచిత్రంగా ఉందని స్థానికులు ఆరోపించారు.

జై భీమ్ POWER OF PEOPLE Jai Bheem

# హనుమకొండ రెడ్ క్రాస్ సేవలను ప్రశంసించిన గవర్నర్





### హనుమకొండ రెడ్ క్రాస్‌లో తలసీమియా పేరెంట్స్ లాంజ్ శిలాఫలకం ఆవిష్కరణ

**హన్మకొండ, 9 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**

తలసీమియా బాధితుల కుటుంబాలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ ప్రాంగణంలో ఏర్పాటు చేయనున్న తలసీమియా పేరెంట్స్ లాంజ్ శిలాఫలకాన్ని తెలంగాణ రాష్ట్ర గవర్నర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షులు శివ ప్రతాప్ శుక్లా గురువారం ఆవిష్కరించారు. వరంగల్ మహానగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న డైనింగ్ హాల్‌పై ఈ పేరెంట్స్ లాంజ్ ఏర్పాటు చేయనున్నారు. గవర్నర్ రాక సందర్భంగా హనుమకొండ జిల్లా కలెక్టర్, రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షురాలు చాహత్ బాజ్‌పాయ్‌తో పాటు రెడ్ క్రాస్ పాలకవర్గ సభ్యులు ఘన స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందజేశారు. జూనియర్ రెడ్ క్రాస్ విద్యార్థులు బ్యాండ్‌తో గౌరవ వందనం అందించి కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించిన అనంతరం గవర్నర్ తలసీమియా సెంటర్‌ను సందర్శించి చికిత్స పొందుతున్న చిన్నారులు, వారి తల్లిదండ్రులతో ఆత్మీయంగా మాట్లాడారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని చిన్నారులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం రెడ్ క్రాస్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ చేపడుతున్న రక్తదాన శిబిరాలు, తలసీమియా బాధితులకు అందిస్తున్న సేవలు, ఆరోగ్య కార్యక్రమాలు, మానవతా సేవలను పాలకవర్గం గవర్నర్‌కు వివరించింది. ఈ సందర్భంగా గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా మాట్లాడుతూ, తలసీమియా బాధితుల తల్లిదండ్రుల సౌకర్యార్థం పేరెంట్స్ లాంజ్ ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. రక్తదాన సేవలతో పాటు ఆరోగ్య, మానవతా రంగాల్లో హనుమకొండ రెడ్ క్రాస్ విశిష్ట సేవలు అందిస్తోందని ప్రశంసించారు. రెడ్ క్రాస్ అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలు అందేలా కృషి చేస్తానని తెలిపారు. తలసీమియా బాధితులకు అందిస్తున్న సేవలకు రెడ్ క్రాస్ పాలకవర్గాన్ని అభినందిస్తూ, భవిష్యత్తులో కూడా అన్ని విధాలుగా సహకరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం రెడ్ క్రాస్ పాలకవర్గం గవర్నర్‌కు శాలువా కప్పి, జ్ఞాపిక అందజేసి ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమంలో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దాన కిషోర్, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్ రామ్ రెడ్డి, హనుమకొండ రెడ్ క్రాస్ చైర్మన్ డా. పి. విజయచందర్ రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ది వెంకట నారాయణ గౌడ్, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, రాష్ట్ర పాలకవర్గ సభ్యులు ఇ.వి. శ్రీనివాస్ రావు, జిల్లా పాలకవర్గ సభ్యులు పుల్లూరి వేణుగోపాల్, డా. ఎం. శేషుమాధవ్, డా. కె. సుధాకర్ రెడ్డి, డా. సీహెచ్. సంధ్యారాణి, బిళ్ల రమణారెడ్డి, జూనియర్ రెడ్ క్రాస్ విద్యార్థులు, రెడ్ క్రాస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్య వెలుగునిస్తుంది - ఆరోగ్యం బలాన్నిస్తుంది : డా. చిర్ర రాజు గౌడ్




**హన్మకొండ, 9 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**

విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి విద్యతో పాటు ఆరోగ్యం కూడా అత్యంత ముఖ్యమని, ఈ రెండూ సమాజ ప్రగతికి బలమైన పునాదులని కాకతీయ విశ్వవిద్యాలయ పాలక మండలి సభ్యులు డా. చిర్ర రాజు గౌడ్ అన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం పొలిటికల్ సైన్స్ విభాగం సెమినార్ హాల్‌లో డా. సంకినేని వెంకట్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన విద్య -- ఆరోగ్య అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, మనిషి జీవితంలో అత్యంత విలువైన రెండు సంపదలు విద్య, ఆరోగ్యమని పేర్కొన్నారు. ఆరోగ్యం బాగుంటేనే విద్యను సమర్థవంతంగా అభ్యసించగలమని, విద్య ద్వారా మంచి ఆలోచనలు, నైతిక విలువలు, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవచ్చని వివరించారు. ఈ రెండూ పరస్పరపూరకాలని, వ్యక్తిగత అభివృద్ధితో పాటు సమాజ పురోగతికి కూడా అవి కీలకమని అన్నారు. విద్యార్థులు ప్రతిరోజూ సమయపాలన పాటిస్తూ చదువుతో పాటు వ్యాయామం, యోగా, క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సమతుల ఆహారం తీసుకోవడం, తగినంత నీరు తాగడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, సరిపడా నిద్రపోవడం వంటి ఆరోగ్యకరమైన అలవాట్లను పెంపొందించుకోవాలని కోరారు. అలాగే మొబైల్ ఫోన్లు, సామాజిక మాధ్యమాల వినియోగాన్ని పరిమితం చేసి చదువు, వ్యక్తిత్వ వికాసం, నైపుణ్యాల అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. తల్లిదండ్రులు పిల్లలపై అనవసర ఒత్తిడి చేయకుండా వారి ప్రతిభను ప్రోత్సహించాలని, ఉపాధ్యాయులు విద్యతో పాటు నైతిక విలువలు, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతలను కూడా విద్యార్థులకు బోధించాలని అన్నారు. ఆరోగ్యవంతమైన, విద్యావంతమైన యువతే దేశానికి నిజమైన బలమని ఆయన పేర్కొన్నారు. ఈ అవగాహన కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరూ విద్య, ఆరోగ్యం పట్ల బాధ్యతతో ముందుకు సాగి ఆరోగ్యవంతమైన, విజ్ఞానవంతమైన సమాజ నిర్మాణానికి తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "విద్య వెలుగునిస్తుంది -- ఆరోగ్యం బలాన్నిస్తుంది. ఈ రెండింటినీ కాపాడుకుంటూ అభివృద్ధి చెందిన భారత నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి" అని ఆకాంక్షించారు.

## ఆర్ట్స్ కళాశాలలో అంబేద్కర్, పూలే విగ్రహాల ప్రతిష్ఠాపనపై వివాదం

### విగ్రహాల ఏర్పాటుకు ఫ్యాకల్టీ అభ్యంతరం తెలిపినట్లు ఎస్సీ/ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రకటన

**హన్మకొండ, 9 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**


ప్రకటన

- ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో భారత రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్. అంబేద్కర్ గారు మరియు మహాత్మా జ్యోతిరావ్ పూలే గారి విగ్రహాలను ప్రతిష్ఠించాలని ఎస్సీ/ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ విజ్ఞప్తికి స్పందిస్తూ, గౌరవనీయులైన వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రతాప్ రెడ్డి గారు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ Ramachandram గారు మరియు ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్. జ్యోతి గారు అనుమతి మంజూరు చేశారు.
- ఈ సటిదాలో, విగ్రహాల ఏర్పాటుకు అనువైన స్థలాన్ని పరిశీలించేందుకు ఈరోజు ఎస్సీ/ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రతినిధులు ఆర్ట్స్ కళాశాలను సందర్శించారు.
- ఈ సందర్భంగా అక్కడ నిర్వహించిన సమావేశంలో ఫ్యాకల్టీ క్లబ్ చైర్మన్ డాక్టర్ దామిర బిక్షపతి గారి నేతృత్వంలో కొందరు ఎస్సీ, ఎస్టీ, బీసీ కాంట్రాక్ట్ అధ్యాపకులు ఆర్ట్స్ కళాశాలలో డా. బి.ఆర్. అంబేద్కర్ గారు మరియు మహాత్మా జ్యోతిరావ్ పూలే గారి విగ్రహాలు ప్రతిష్ఠాపనకు అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఒక తీర్మానం చేసినట్లు తెలియజేశారు.
- దీనిపై ఎస్సీ/ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ వారితో చర్చించి, సంబంధిత అంశంపై పూర్తి స్పష్టత వచ్చిన తర్వాతే తదుపరి చర్యలు చేపట్టాలని నిర్ణయించింది. అలాగే, వారు చేసిన తీర్మానాన్ని రాతపూర్వకంగా అందజేయాలని కోరడం జరిగింది. ఆ లేఖ అందిన అనంతరం పరిస్థితిని సమగ్రంగా పరిశీలించి, అసోసియేషన్ భవిష్యత్ కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటుంది.

SC/ST ఎంప్లాయీస్ అసోసియేషన్

కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో భారత రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్. అంబేద్కర్, మహాత్మా జ్యోతిరావ్ పూలే విగ్రహాల ప్రతిష్ఠాపన అంశం చర్చనీయాంశంగా మారింది. ఎస్సీ/ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ విజ్ఞప్తికి స్పందించిన వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కె. ప్రతాప్ రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి. రామచంద్రం, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్. జ్యోతి విగ్రహాల ఏర్పాటుకు అనుమతి మంజూరు చేసినట్లు అసోసియేషన్ తెలిపింది. ఈ నేపథ్యంలో విగ్రహాల ఏర్పాటుకు అనువైన స్థలాన్ని పరిశీలించేందుకు గురువారం ఎస్సీ/ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రతినిధులు ఆర్ట్స్ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఫ్యాకల్టీ క్లబ్ చైర్మన్ డాక్టర్ దామిర బిక్షపతి ఆధ్వర్యంలో కొందరు ఎస్సీ, ఎస్టీ, బీసీ కాంట్రాక్ట్ అధ్యాపకులు ఆర్ట్స్ కళాశాలలో డా. బి.ఆర్. అంబేద్కర్, మహాత్మా జ్యోతిరావ్ పూలే విగ్రహాల ప్రతిష్ఠాపనకు అభ్యంతరం వ్యక్తం చేస్తూ తీర్మానం చేసినట్లు అసోసియేషన్ వెల్లడించింది. ఈ పరిణామాల నేపథ్యంలో సంబంధిత అధ్యాపకులతో చర్చించి పూర్తి స్పష్టత వచ్చిన అనంతరమే తదుపరి చర్యలు చేపట్టాలని ఎస్సీ/ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ నిర్ణయించినట్లు తెలిపింది. అలాగే, వారు చేసిన తీర్మానాన్ని రాతపూర్వకంగా అందజేయాలని కోరినట్లు పేర్కొంది. సదరు తీర్మానం అందిన తర్వాత పరిస్థితిని సమగ్రంగా పరిశీలించి, అసోసియేషన్ భవిష్యత్ కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటామని ఎస్సీ/ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ తన ప్రకటనలో వెల్లడించింది.

## నూతన పోలీస్ కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ప్రజాప్రతినిధులు

**వరంగల్, 9 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**




వరంగల్ పోలీస్ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఎన్. శ్వేతా రెడ్డి, ఐపీఎస్‌ను గురువారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో పలువురు ప్రజాప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు, వరంగల్ కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు, ఈవి శ్రీనివాస్ రావు పోలీస్ కమిషనర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. నూతన బాధ్యతల్లో ప్రజలకు సమర్థవంతమైన పోలీసింగ్ అందిస్తూ విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ తమ అభినందనలు తెలిపారు. పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేతా రెడ్డి ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## హనుమకొండలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కలకలం

### పబ్లిక్ గార్డెన్-బస్టాండ్ మార్గంలో లభ్యం.. ఆచూకీ కోసం పోలీసుల గాలింపు

**హన్మకొండ, 9 జూలై 2026(జై భీమ్ న్యూస్)**



హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్ నుంచి బస్టాండ్‌కు వెళ్లే ప్రధాన రహదారిలో గురువారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం కావడం కలకలం రేపింది. సమాచారం అందుకున్న సుబేదారి పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పోలీసుల వివరాల ప్రకారం, మృతుడు సుమారు 50--55 సంవత్సరాల వయస్సు కలిగి ఉండగా, 5 అడుగుల 3 అంగుళాల ఎత్తు, చామనచాయ రంగు, గుండ్రటి ముఖం, నల్లటి మీసాలు, తెల్లటి పిల్లిగడ్డం ఉన్నాయి. అతని ఎడమ కాలు పాదం మణికట్టు భాగంలో బ్యాండేజ్ కట్టివుండటం ప్రత్యేక గుర్తింపుగా పోలీసులు తెలిపారు. మృతుడు తెలుపు రంగు ఫుల్ హ్యాండ్స్ చొక్కా, కాఫీ రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడి గుర్తింపు కోసం దర్యాప్తు చేపట్టిన సుబేదారి పోలీసులు, కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నారు. మృతుడి ఆచూకీ లేదా కుటుంబ సభ్యుల వివరాలు తెలిసిన వారు వెంటనే సుబేదారి పోలీస్ స్టేషన్‌ను లేదా ఇన్‌స్పెక్టర్ ఎం. రంజిత్ కుమార్ (8712685114), ఎస్ఐ కృష్ణవేణి (8712584596)లను సంప్రదించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

## బిఆర్ఎస్ ఖాతాలోని 1400 కోట్లు పంచాలి

### అమరలు కుటుంబాలకు పంచి నిజాయితీ చాటాలి
### టిఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత డిమాండ్

**భద్రాద్రికొత్తగూడెం,జూలై9(జై భీమ్ న్యూస్):**

బీఆర్ఎస్ పార్టీ ఖాతాలోని రూ.1,400 కోట్లు అమరుల కుటుంబాలకు పంచాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత డిమాండ్ చేశారు. ఆ డబ్బు క్విడ్ ప్రోకో ద్వారా వచ్చింది కాదా?అని ప్రశ్నించారు. బాయిబాట కార్యక్రమంలో భాగంగా కొత్తగూడెంలో కవిత పర్యటించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. మా పార్టీతో భయం లేదంటూనే ఈసీకి వెయ్యికి పైగా ఫిర్యాదులు ఇచ్చారు. టీఆర్ఎస్ పేరు నాకు రాకుండా కుట్రలు చేస్తున్నారు. బీఆర్ఎస్ పార్టీకి నీతినియమాలు అంటూ ఏమీ లేవా? తల్లి, చెల్లి అనే సభ్యత మరిచి పార్టీ సోషల్ మీడియాలో కామెంట్లు చేస్తున్నారు. నా కంఠంలో ప్రాణముండగా మళ్లీ బీఆర్ఎస్‌లోకి వెళ్లను. నా పోరాటాలు ప్రజల్లోకి వెళ్లకుండా కాంగ్రెస్, భాజపా చేతులు కలిపాయని ఆరోపించారు. ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్‌కు క్విడ్ ప్రోకో కింద కేటీఆర్ అక్రమ పర్మిషన్లు ఇచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిలో హరీశ్‌రావు అనకొండ. బీఆర్ఎస్ పార్టీ ఇంకా ఆయన్నే ముందు పెడుతోంది. ఆ పార్టీ ఈ జన్మలో బాగుపడదు.. అధికారంలోకి రాదు. పెద్దాయనకు మరకలు అంటించిన ఆయనకు 3 నెలలు మంత్రి పదవి కావాలంట. కేటీఆర్ ఇటీవల రూ.188 కోట్లతో ఓ ఇంగ్లిష్ పత్రిక కొన్నారు. ఫీనిక్స్ సంస్థకు రూ.80వేల కోట్ల విలువైన భూముల కట్టబెట్టారు. ఆ సంస్థ రూ.33 లక్షల టన్నుల కలప కొట్టేస్తోందని కవిత ఆరోపించారు.

## జిల్లా పోలీస్ కార్యాలయాన్ని సందర్శించిన డీఐజీ ఎల్.ఎస్. చౌహాన్



**వికారాబాద్, 9 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**

చార్మినార్ జోన్ డీఐజీ ఎల్.ఎస్. చౌహాన్, ఐపీఎస్ వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం వికారాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయం (డీపీఓ)ను సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్ డీఐజీకి ఘన స్వాగతం పలికారు. అనంతరం డీఐజీ పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటిన డీఐజీ, ఇటీవల పునరుద్ధరించిన ఎస్పీ ఛాంబర్‌ను ప్రారంభించి పరిశీలించారు. అనంతరం డీపీఓలోని వివిధ విభాగాలైన డీసీఆర్‌బీ, డీఎస్‌బీ, డీఏఆర్, పరిపాలనా విభాగాలు, రికార్డు శాఖలు, ఆయుధాగారం, సిబ్బంది నిర్వహణ విభాగాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. రికార్డుల నిర్వహణ, కేసుల పర్యవేక్షణ, ఫైళ్ల నిర్వహణ, సేవా రికార్డులు, కార్యాలయ పరిపాలన విధానాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డీఐజీ ఎల్.ఎస్. చౌహాన్ మాట్లాడుతూ, ప్రతి శాఖలో రిజిస్టర్లు, రికార్డులు, కేసులకు సంబంధించిన ఫైళ్లను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని సూచించారు. కార్యాలయాల్లో క్రమశిక్షణ, పరిశుభ్రత, సమయపాలనకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రజల నుంచి వచ్చే వినతులు, ఫిర్యాదులను జాప్యం లేకుండా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అన్ని విభాగాలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ కార్యాలయ పనితీరును మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దాలని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి రికార్డుల నిర్వహణను మెరుగుపరచాలని సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేస్తూ పోలీసు శాఖ ప్రతిష్ఠను మరింత పెంచేలా ప్రతి అధికారి బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ రాజేశ్ మీనా, ఐపీఎస్, డీసీఆర్‌బీ డీఎస్పీ జానయ్య, వికారాబాద్ డీఎస్పీ అంజయ్య, డీటీసీ డీఎస్పీ శ్రీనివాస్, డీఏఆర్ డీఎస్పీ వీరేశ్, ఇతర అధికారులు, ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తున్నాం

**రెండున్నరేళ్లలోనే 35వేల కోట్లు రైతులకు అందచేత**
**రైతులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తున్నాం**
**బిఆర్ఎస్ పాలనలో క్రాప్ డ్యామేజ్‌కు కెసిఆర్ ఒక్క పైసా ఇవ్వలేదు**
**ఖమ్మం పర్యటనలో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క**

**ఖమ్మం,జూలై9(జై భీమ్ న్యూస్):**

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తున్నామని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. రైతాంగానికి అవసరమైన సహాయ సహకారాలు అన్ని విధాలుగా అందిస్తున్నామని పేర్కొన్నారు. గురువారం ఖమ్మం జిల్లా చింతకాని మండలం లచ్చగూడెంలో డిప్యూటీ సీఎం పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. చింతకాని మండలం జగన్నాధపురం మత్కేపల్లి క్రాస్ రోడ్డులో రైతు ఆశీర్వాద సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. రైతు ఆశీర్వాద సభకు సీఎం రేవంత్‌రెడ్డితో పాటు కేబినెట్ మంత్రులు అందరినీ ఆహ్వానించామని పేర్కొన్నారు. పదేళ్ల పాటు పాలించిన బీఆర్ఎస్ రైతు భరోసాకు రూ.75 వేల కోట్లు ఖర్చు చేసిందని మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసాకు కేవలం రెండున్నరేళ్లలో రూ.35 వేల కోట్లను రైతులకు అందజేసిందని చెప్పుకొచ్చారు. కేసీఆర్ హయాంలో క్రాప్ డ్యామేజ్‌కి ఒక్క రూపాయి కూడా ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో రైతుల కోసం పని చేస్తోందని స్పష్టం చేశారు. రైతుభరోసా కింద కేవలం తొమ్మిది రోజుల్లో ఎనిమిది ఎకరాల చొప్పున పూర్తిస్థాయిలో అందరికీ రూ.8759 కోట్లు ఇచ్చామని వెల్లడించారు. రైతు ఆశీర్వాద సభలో మరో రూ.1900 కోట్లు రైతు భరోసాకు తొమ్మిది ఎకరాల నుంచి యాభై ఎకరాల వరకూ విడుదల చేయనున్నామని తెలిపారు. అన్నదాతలు రైతు ఆశీర్వాద సభకు పెద్ద సంఖ్యలో తరలి రావాలని మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం జగన్నాధపురంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న మెగా రైతు మేళాను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ల చైర్మన్లు రాయల నాగేశ్వరరావు, నాయుడు సత్యనారాయణ, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి, జిల్లా కలెక్టర్ దివాకరతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. రైతులకు ఆధునిక సాగు పద్ధతులు, ప్రభుత్వ పథకాలు, వ్యవసాయ సాంకేతికతపై అవగాహన కల్పించడమే ఈ మెగా రైతు మేళా ప్రధాన లక్ష్యంగా నిర్వాహకులు తెలిపారు. మెగా రైతు మేళా ప్రాంగణంలోనే శుక్రవారం మధ్యాహ్నం రైతు ఆశీర్వాద సభ నిర్వహించనున్నారు. ఈ సభకు సీఎం రేవంత్ రెడ్డి హాజరుకానున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమ కార్యక్రమాలు, వ్యవసాయ అభివృద్ధి చర్యలపై సీఎం రైతులను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ప్రభుత్వంపై భట్టి విక్రమార్క విమర్శలు గుప్పించారు. దశాబ్దాల క్రితం నిర్మించిన నాగార్జునసాగర్, ఎస్ఆర్ఎస్పీ, కడెం వంటి ప్రాజెక్టులు ఇప్పటికీ బలంగా ఉన్నాయని, బీఆర్ఎస్ నిర్మించిన ప్రాజెక్టుల పరిస్థితి రాష్ట్ర ప్రజలకు తెలిసిందేనని వ్యాఖ్యానించారు. ఖమ్మం జిల్లాకు గత ప్రభుత్వాలు తగిన నీటి వనరులు అందించలేదని, ఆ విషయాన్ని చరిత్రతో సహా నిరూపిస్తామని అన్నారు. బీఆర్ఎస్ ప్రజలను మాటలతో మోసం చేసే పార్టీ అని, 2023 అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల ఫలితాలే అందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆ పార్టీ నేతలు జిల్లాల పర్యటనలు చేస్తూ విమర్శలు చేస్తున్నప్పటికీ ప్రజలు నమ్మే పరిస్థితి లేదని భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షపాతం తక్కువగా నమోదవుతోందని, రైతులు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పంటల ఎంపిక చేసుకోవాలని సూచించారు. తక్కువ కాలంలో దిగుబడి వచ్చే పంటలు, ఆరుతడి పంటలు, పప్పుధాన్యాల సాగుపై రైతులు దృష్టి సారించాలని కోరారు. నాగార్జునసాగర్‌లో నీటి లభ్యత తక్కువగా ఉన్న నేపథ్యంలో సీతారామ ప్రాజెక్టు, రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా వైరా ప్రాజెక్టుకు నీటిని విడుదల చేస్తున్నామని తెలిపారు. ఆ నీరు ఇవాళ లేదా రేపటిలోగా వైరా రిజర్వాయర్‌కు చేరుతుందని వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం తొమ్మిది రోజుల్లోనే రూ.9 వేల కోట్ల రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసిందని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. మధిర నియోజకవర్గంలోని మొక్కజొన్న రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కోరడంతో రాష్ట్రవ్యాప్తంగా మొక్కజొన్న కొనుగోలు చేపట్టినట్లు తెలిపారు. ప్రకృతి, కేంద్ర ప్రభుత్వ సహకారం పూర్తిస్థాయిలో లేకపోయినా రైతుల కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. కేంద్రం నుంచి అవసరమైన ఎరువులు సాధించామని, బ్లాక్ మార్కెట్‌ను అరికట్టేందుకు టెక్నాలజీ వినియోగిస్తూ యాప్ ద్వారా యూరియా పంపిణీ చేస్తున్నామని చెప్పారు. అలాగే వర్షాల సమాచారాన్ని కూడా సాంకేతికత ద్వారా రైతులకు ఎప్పటికప్పుడు అందిస్తున్నామని వెల్లడించారు. సభలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల కోసం పనిచేయడం లేదని విమర్శించే వారికి లెక్కలతో సహా సమాధానం చెబుతామని అన్నారు. రైతు భరోసా పథకం కింద కేవలం తొమ్మిది రోజుల్లోనే రూ.9 వేల కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేసిన ప్రభుత్వం కాంగ్రెస్ మాత్రమేనని పేర్కొన్నారు. వ్యవసాయ యాంత్రీకరణ కోసం ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తోందని, రైతుల ఆదాయం పెరిగేలా చర్యలు తీసుకుంటోందన్నారు.



# జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యకు పరిష్కారం

**సిఎంతో చర్చిస్తానని డిప్యూటి సిఎం భట్టి హామీ**

**ఖమ్మం,జూలై9(జై భీమ్ న్యూస్):**

సొసైటీలతో సంబంధం లేకుండా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించే అంశాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఖమ్మం జిల్లా కమిటీ గురువారం చింతకాని మండలం లచ్చగూడెంలో సమర్పించిన వినతిపత్రంపై భట్టి సానుకూలంగా స్పందించారు. శుక్రవారం జగన్నాథపురం లో నిర్వహించనున్న రైతు ఆశీర్వాద సభకు ముఖ్యమంత్రి హాజరవుతున్న నేపథ్యంలో జర్నలిస్టుల ఇళ్ల స్థలాల అంశాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లాలని ఫెడరేషన్ ప్రతినిధులు కోరారు. దీనిపై స్పందించిన భట్టి విక్రమార్క.. సొసైటీల ద్వారా స్థలాల కేటాయింపులో న్యాయపరమైన చిక్కులు ఉన్నందున, వాటికి అతీతంగా వ్యక్తిగతంగా, బీపీఎల్ కోటా లేదా ఇతర విధానాల ద్వారా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు అందించే మార్గాలను పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. వినతిపత్రంలో టీడబ్ల్యూజేఎఫ్ నేతలు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అధిక సంఖ్యలో జర్నలిస్టులు పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందినవారని, తక్కువ వేతనాలతో అ÷–దదె ఇళ్లలో నివసిస్తూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం గత, ప్రస్తుత ప్రభుత్వాల దృష్టికి పలుమార్లు విజ్ఞప్తులు చేయడంతో పాటు ఉద్యమాలు కూడా నిర్వహించినట్లు తెలిపారు. గత ప్రభుత్వం వెలుగుమట్ల వీవీ పాలెం రెవెన్యూ పరిధిలో 23 ఎకరాలకు పైగా భూమిని కేటాయిస్తూ జీవో జారీ చేసినప్పటికీ, అది అమలుకు నోచుకోలేదని గుర్తు చేశారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో కొన్ని న్యాయపరమైన సందిగ్ధతలు ఏర్పడినప్పటికీ, సొసైటీలతో సంబంధం లేకుండా వ్యక్తిగతంగా ఇళ్ల స్థలాలు ఇస్తామని ముఖ్యమంత్రి ఇప్పటికే హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఈ ప్రక్రియలో జాప్యాన్ని వీడి, జర్నలిస్టులకు ఏ ప్రాతిపదికన, ఎప్పటిలోగా ఇళ్ల స్థలాలు కేటాయిస్తారో నిర్దిష్టమైన గడువుతో ప్రకటించేలా ముఖ్యమంత్రితో చర్చించాలని ఉపముఖ్యమంత్రిని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ ఖదీర్, జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షుడు దువ్వా సాగర్, టీబీజేఏ జిల్లా అధ్యక్షుడు ఆవుల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి మానుకొండ రవికిరణ్, జిల్లా కమిటీ సభ్యులు రాంపుడి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణిలో మెడికల్ బోర్డు ఏర్పాటు చేయాలి

**20 నుంచి గోదావరిఖనిలో నిరాహార దీక్షకు కవిత నిర్ణయం**

**భద్రాద్రికొత్తగూడెం,జూలై9(జై భీమ్ న్యూస్):**

తెలంగాణ రాష్ట్ర సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం ఏరియాలోని పీవీకే5 భూగర్భగనిని సందర్శించారు. గని ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. 'సింగరేణిలో మెడికల్ బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతూ ఈ నెల 20 నుంచి గోదావరిఖనిలో నిరాహార దీక్ష చేపడతాం. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సింగరేణికి రావాల్సిన బకాయిలను తక్షణమే చెల్లించాలి. కార్మికుల పట్ల చిత్తశుద్ధి ఉంటే కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు రాష్ట్ర శాసన సభలో నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా తీర్మానం చేయించాలి. కార్మికులకు హెచ్ఎంఎస్ ఎప్పుడూ అండగా ఉంటుంది. కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాల్సి ఉండగా.. నామమాత్రపు జీతాలు ఇస్తున్నారని కవిత మండిపడ్డారు.

## బండి భగీరథ్‌కు షరతులతో కూడిన బెయిల్

**దర్యాప్తుకు సహకరించాలని హైకోర్టు ఆదేశం**

**హైదరాబాద్,జూలై9(జై భీమ్ న్యూస్):**

కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్ కు ఊరట లభించింది. పోక్సో కేసులో అతడికి తెలంగాణ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. షరతులతో కూడిన బెయిల్ ఇచ్చిన ఉన్నత న్యాయస్థానం.. దర్యాప్తునకు సహకరించాలని బండి భగీరథ్‌ను ఆదేశించింది. హైదరాబాద్‌లోని పేట్‌బషీరాబాద్ పీఎస్‌లో అతడిపై పోక్సో కేసు నమోదైంది. మే 16న పోలీసులు అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. బండి భగీరథ్ బెయిల్ పిటిషన్‌పై ఇటీవల వాదనలు ముగియడంతో తీర్పును హైకోర్టు వాయిదా వేసింది. పిటిషనర్ తరపు న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ భగీరథ్ విద్యార్థి అని, 45 రోజులకుపైగా జైలులో ఉండటంతో జీవితంలో చాలా కోల్పోయాడన్నారు. పరస్పర అంగీకారంతో జరిగిన దానిపై కేసులు నమోదు చేయడం చెల్లదని.. ఇదే విషయాన్ని హైకోర్టు, సుప్రీంకోర్టులు పలు తీర్పుల్లో వెల్లడించాయన్నారు. బెయిల్ మంజూరు చేస్తే కోర్టు విధించిన షరతులకు కట్టుబడి ఉంటారన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వరరావు వాదనలు వినిపిస్తూ.. మే 8న ఎఫ్ఐఆర్ నమోదు చేసిన వెంటనే వాంగ్మూలాల సేకరణ మొదలైందన్నారు. దర్యాప్తు దాదాపు పూర్తికావచ్చిందని, గడువులోగా అభియోగ పత్రాన్ని దాఖలు చేస్తామన్నారు. ఈ దశలో బెయిల్ మంజూరు చేస్తే సాక్షులను ప్రభావితం చేస్తారన్నారు. ఇరుపక్షాల వాదనలను విన్న న్యాయమూర్తి జస్టిస్ కె.సుజన భగీరథ్‌కు బెయిల్ మంజూరు చేస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

**స్పీకర్, మండలి ఛైర్మన్‌తో సిఎస్ భేటీ**

హైదరాబాద్,జూలై9(జై భీమ్ న్యూస్): తెలంగాణ నూతన సీఎస్ సంజయ్ జాజు గురువారం తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డిని, శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌లను వారివారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలి చైర్మన్‌కు, అసెంబ్లీ స్పీకర్‌కు సీఎస్ పుష్పగుచ్ఛం అందజేసి ,శాలువాతో సత్కరించారు. అనంతరం వారు సీఎస్‌ను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి సెక్రెటరీ డాక్టర్ నరసింహాచార్యులు , వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం అనన్య తదితరులు పాల్గొన్నారు.

# ఐదేళ్ల వైసీపీ అరాచక పాలన వల్ల నష్టపోయిన రాష్ట్రం

**రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడి**

**మచిలీపట్నం,జూలై9(జై భీమ్ న్యూస్):**

గత ఐదేళ్ల వైసీపీ అరాచక పాలన వల్ల రాష్ట్రం తీవ్రంగా నష్టపోయిందని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర మండిపడ్డారు. వైసీపీ అధినేత నుంచి చోటా నాయకుల వరకు అభివృద్ధికి ఆటంకాలు సృష్టించడమే పనిగా పెట్టుకున్నారని ధ్వజమెత్తారు. ప్రతిపక్షాలు చేస్తున్న పసలేని విమర్శలను తాము పట్టించుకోబోమని తెలిపారు. మచిలీపట్నం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. బందరు మండలం కానూరు శివారు చిన్న క్యాంప్ బెల్ గ్రామంలో నూతనంగా నిర్మించిన హెడ్ వాటర్ ట్యాంక్‌ను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ సంక్షేమం, అభివృద్ధి బాటలో ముందుకు సాగుతామని మంత్రి వెల్లడించారు. బందరు పట్టణంలో ఇప్పటికే ఇంటింటికీ తాగునీరు సరఫరా చేస్తున్నామని, అదే రీతిలో గ్రామీణ ప్రాంతాల్లో సైతం ప్రతి ఇంటికీ సురక్షిత జలాలు అందించేందుకు జలజీవన్ మిషన్ కింద రూ.200 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. ఈ ప్రాంత రూపురేఖలను మార్చే ప్రతిష్ఠాత్మక బందరు పోర్టు పనులను వేగవంతం చేసి, వచ్చే ఏడాది ఆరంభంలోనే ప్రారంభిస్తామని ప్రకటించారు. దీని ద్వారా మచిలీపట్నం ప్రాంతం పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందుతుందని, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని మంత్రి కొల్లు రవీంద్ర ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు, అధికారులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# టెకీ రాధాగాయత్రి మృతి కేసులో కీలక పరిణామం

**భర్త శ్రీచరణ్‌తో పాటు అత్తమామలకు నోటీసులు**

**విశాఖపట్నం,జూలై9(జై భీమ్ న్యూస్):**

విజయనగరం జిల్లాకు చెందిన టెకీ రాధాగాయత్రి అనుమానాస్పద మృతి కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆమె భర్త శ్రీచరణ్‌తో పాటు అతడి తల్లిదండ్రులు దుర్గాప్రసాద్, సీతామహాలక్ష్మిలకు ఉత్తరాఖండ్ పోలీసులు సమన్లు జారీ చేశారు. ఎఫ్ఐఆర్ నంబర్ 19/26 సెక్షన్ 103 బీఎన్ఎస్‌గా ఈ కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు పోలీసులు పేర్కొన్నారు. పుణెలో శ్రీచరణ్ పనిచేస్తున్న కార్యాలయానికి ఆయనకు చెందిన నోటీసులను పంపారు. మరోవైపు ఈ కేసులో విచారణ కొనసాగిస్తున్న మసూరీ సబ్ డివిజినల్ మేజిస్ట్రేట్ రాహుల్ ఆనంద్ పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ ఘటనకు సంబంధించి ఏమైనా చెప్పాలనుకుంటే మౌఖికంగా లేదా రాతపూర్వకంగా తెలపవచ్చని పేర్కొన్నారు. ఈనెల 17లోపు తమ వాంగ్మూలాలను సమర్పించాలని రాహుల్ ఆనంద్ సూచించారు.

# జ్ఞానేశ్వరి కోసం ముమ్మర గాలింపు

**కొండప్రాంతంలో మళ్లీ ముమ్మరంగా తనిఖీ**

**కాకినాడ,జూలై9(జై భీమ్ న్యూస్):**

కాకినాడ జిల్లా తుని మండలం సీహెచ్ అగ్రహారం గ్రామానికి చెందిన చిన్నారి జ్ఞానేశ్వరి అదృశ్యమైన కేసులో మరోసారి గాలింపు చర్యలు వేగవంతమయ్యాయి. జూన్ 6వ తేదీన అదృశ్యమైన చిన్నారి ఆచూకీ కోసం అధికారులు విస్తృత స్థాయిలో శోధిస్తున్నారు. ముఖ్యంగా చిన్నారి ఇంటి వెనుక ఉన్న కొండ ప్రాంతంలో మళ్లీ గాలింపు చర్యలు చేపట్టారు. ఆ ప్రాంతంపై పూర్తి అవగాహన ఉన్న స్థానికుల సహకారంతో అధికారులు శోధిస్తున్నారు. ఈ నేపథ్యంలో కాకినాడ జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సీహెచ్ అగ్రహారం గ్రామాన్ని సందర్శించి జ్ఞానేశ్వరి కుటుంబ సభ్యులను పరామర్శించారు. చిన్నారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ప్రభుత్వం వారికి అండగా నిలుస్తోందని భరోసా ఇచ్చారు. చిన్నారి ఆచూకీ కోసం అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోందని, గాలింపు చర్యలను మరింత విస్తృతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇదే సమయంలో కుటుంబానికి అవసరమైన ఆర్థిక సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. చిన్నారి జ్ఞానేశ్వరి కోసం ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రయత్నిస్తోందని పేర్కొన్నారు. ఈ కేసును అత్యంత ప్రాధాన్యంతో పరిశీలిస్తున్నామని చెప్పుకొచ్చారు. గాలింపు చర్యలు ఆగకుండా కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. చిన్నారి ఆచూకీ లభించే వరకు అన్ని అవకాశాలను పరిశీలిస్తామని స్పష్టం చేశారు.జ్ఞానేశ్వరి అదృశ్యం కేసు జిల్లాలో తీవ్ర ఆందోళనకు కారణమైంది. చిన్నారి క్షేమంగా తిరిగి రావాలని కుటుంబ సభ్యులతో పాటు స్థానిక ప్రజలు కూడా కోరుకుంటున్నారు. ఈ కేసులో జరుగుతున్న ప్రతి పరిణామంపై అధికారులు నిశితంగా నిఘా ఉంచి చర్యలు చేపడుతున్నారు.

# జోసెఫ్ రావణ్‌కు పోలీసుల షాక్

**బ్యాంక్ ఖాతాలను స్తంభింప చేస్తూ ఆదేశాలు**

**కాకినాడ,జూలై9(జై భీమ్ న్యూస్):**

రెండేళ్లుగా యూట్యూబ్ వేదికగా విద్వేషపూరిత ప్రసంగాలు చేస్తున్న యూట్యూబర్ జోసఫ్ రావణ్ ఆర్థిక వనరులపై పోలీసులు దృష్టి పెట్టారు. ఇందులో భాగంగా ఐసీఐసీఐ, యస్ బ్యాంకులకు కాకినాడ పోలీసులు అధికారికంగా లేఖలు రాశారు. పోలీసుల నుంచి వచ్చిన విజ్ఞప్తిని పరిశీలించిన బ్యాంక్ యాజమాన్యాలు, అతని పేరున ఉన్న ఖాతాలను తక్షణమే నిలిపివేస్తూ నిర్ణయం తీసుకున్నాయి. పోలీసుల ప్రాథమిక విచారణలో జోసఫ్ రావణ్ ఆర్థిక వనరులకు సంబంధించిన కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. 'ప్రశ్న' అనే వెబ్‌సైట్‌లో ఈ వివాదాస్పద వీడియోలను పోస్ట్ చేయడం ద్వారా అతను నెలకు రూ. 1.50 లక్షలకు పైగా ఆదాయం గడిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ప్రజల్లో ద్వేషాన్ని రేకెత్తించే కంటెంట్ ద్వారానే ఈ సంపాదన వస్తున్నట్లు తేలింది. కేసు దర్యాప్తును వేగవంతం చేసిన పోలీసులు.. ఈ నెల 2వ తేదీన రావణ్ మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆ ఫోన్‌ను తదుపరి విశ్లేషణ కోసం ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీకి (ఈ÷ూఒ) పంపించారు. ప్రస్తుతం అతని ఫోన్‌లో నిక్షిప్తమై ఉన్న వివాదాస్పద వీడియోలు, డిలీట్ చేసిన డేటాతో పాటు వాట్సాప్ చాటింగ్‌లపై పోలీసులు లోతుగా ఆరా తీస్తున్నారు. అతని వెనుక ఎవరైనా ఉన్నారా అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE

# నేడు విడుదలవుతున్న..లెనిన్

**మరికొన్న డబ్బింగ్ మూవీలు కూడా సందడి**




ఈ నెల రెండో శుక్రవారం బాక్సాఫీస్ వద్ద సరికొత్త చిత్రాల సందడి నెలకొనబోతోంది. ఈ వారం టాలీవుడ్ నుంచి అఖిల్ అక్కినేని మోస్ట్ అవేటెడ్ యాక్షన్ డ్రామా 'లెనిన్' నేరుగా థియేటర్లలోకి వస్తుండగా, దీనికి పోటీగా భారీ సంఖ్యలో డబ్బింగ్ సినిమాలు కూడా రేసులో నిలిచాయి. ఇక వైవిధ్యమైన కథాంశాలతో, విభిన్న జోనర్లలో ప్రేక్షకులను అలరించేందుకు ఆసక్తికరమైన చిత్రాలు విడుదలవుతున్నాయి. అఖిల్ అక్కినేని కెరీర్‌లోనే అత్యంత రగ్గడ్ లుక్‌లో కనిపించనున్న యాక్షన్ డ్రామా 'లెనిన్'. మురళి కిషోర్ అబ్బురు దర్శకత్వంలో రాయలసీమ నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. ఒక అందమైన ప్రేమకథ హింసాత్మక మలుపులు తిరిగితే ఎలా ఉంటుందనే కథాంశంతో వస్తున్న ఈ సినిమాను నాగార్జున అక్కినేని, సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మించారు. థమన్ ఎస్ దీనికి సంగీతం అందించారు. ఇకపోతే మైథాలజీ మరియు యాక్షన్ ఎలిమెంట్స్‌తో వస్తోన్న చిత్రం 'వాసుదేవ సుతం'. పూరీ జగన్నాథ ఆలయంలో దాగి ఉన్న ఒక పవిత్రమైన శక్తిని రక్షించడానికి ఒక యువకుడు చేసే పోరాటమే ఈ సినిమా కథ. మాస్టర్ మహేంద్రన్, అంబికా వాణి, సుమేధా బజాజ్ ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రానికి వైకుంఠ్ బోను దర్శకత్వం వహించగా, మణిశర్మ సంగీతాన్ని సమకూర్చారు. ఇకపోతే మలయాళంలో విడుదలై తెలుగులో రాబోతున్న సస్పెన్స్ థ్రిల్లర్ 'ఐ, నోబడీ'. నిసామ్ బషీర్ దర్శకత్వంలో పృథ్వీరాజ్ సుకుమారన్, పార్వతి తిరువోతు ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రం, ఒక భారీ బ్యాంక్ దోపిడీ కేసులో అన్యాయంగా ఇరుక్కున్న ఒక సాధారణ వ్యక్తి తన నిర్దోషిత్వాన్ని ఎలా నిరూపించు కున్నాడు అనే కథతో సాగుతుంది. తమిళ రొమాంటిక్ కామెడీ చిత్రం 'లవ్ ఓ లవ్' కూడా నేడు తెలుగు ప్రేక్షకులను పలకరించనుంది. మహేష్ రాజేంద్రన్ దర్శకత్వంలో పవిష్ నారాయణన్, నాగ దుర్గ, ఆదిత్య కతిర్ నటించిన ఈ సినిమా, అప్పుల్లో మునిగిపోయిన ఒక యువకుడి ప్రేమకథ చుట్టూ తిరుగుతుంది. ఇందులో ప్రముఖ దర్శకులు సెల్వరాఘవన్, కె. ఎస్. రవికుమార్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ప్రేమ, బ్రేకప్ మరియు గుండె లోతుల్లోని భావాల సమాహారంగా వస్తోన్న భావోద్వేగభరిత చిత్రం 'హృదయం మురళి'. అథర్వ మురళి, ప్రీతి ముకుందన్ జంటగా ఆకాష్ భాస్కరన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో కాయాదు లోహర్, నిహారిక ఎన్.ఎమ్ ఇతర పాత్రలు పోషించారు. తమిళంలో 'ఇదయం మురళి'గా, తెలుగులో 'హృదయం మురళి'గా ఈ సినిమా రిలీజ్ కానుంది. బాలీవుడ్ నుంచి నవ్వుల పండగను తీసుకురావడానికి 'ధమాల్ 4' వస్తోంది. ఇంద్ర కుమార్ దర్శకత్వంలో అజయ్ దేవగన్, రితీష్ దేశ్‌ముఖ్, అర్షద్ వార్సి, జావేద్ జాఫేరి, సంజయ్ మిశ్రా, రవి కిషన్ కలయికలో వస్తోన్న ఈ క్రేజీ కామెడీ ఎంటర్‌టైనర్ ప్రేక్షకులను నవ్వించడానికి సిద్ధమైంది. ఇలా విభిన్నమైన జోనర్లతో, భారీ సంఖ్యలో డబ్బింగ్ సినిమాలతో ఈ శుక్రవారం బాక్సాఫీస్ కళకళలాడబోతోంది.

# జన నాయగన్ విడుదలకు సిద్ధం

విజయ్ 'జన నాయగన్' కోసం అభిమానులు ఎన్నో నెలల నుంచి ఎదురుచూస్తున్న సంగతి తెలిసిందే. సెన్సార్ సర్టిఫికెట్ ఆలస్యం కారణంగా నిలిచిపోయిన ఈ చిత్రం.. ఈ నెలలోనే విడుదల కావడం దాదాపు ఖాయంగానే కన్పిస్తోంది. దీనిపై కెనడా డిస్ట్రిబ్యూటర్ హింట్ ఇవ్వడంతో మరోసారి విడుదల తేదీపై చర్చ మొదలైంది. కెనడాకు చెందిన ప్రముఖ డిస్ట్రిబ్యూటర్ యార్క్ సినిమాస్ సోషల్ మీడియా వేదికగా ఓ పోస్ట్ చేసింది. 'ఎట్టకేలకు మన దళపతి విజయ్ 'జన నాయగన్' సినిమాతో వెండితెరపై మెరిసేందుకు సిద్ధమయ్యారు. జులై 24 నుంచి కెనడాలో యార్క్ సినిమాస్ ఈ చిత్రాన్ని గ్రాండ్‌గా విడుదల చేస్తోంది' అంటూ ఓ పోస్టర్ పంచుకుంది. త్వరలోనే టికెట్ బుకింగ్స్ కూడా ఓపెన్ అవుతాయని తన పోస్ట్‌లో తెలిపింది. దీంతో ఈ తేదీకి రావడం దాదాపుగా ఖాయమైనట్లు తెలుస్తోంది. ఇక, దీనికి ఒక రోజు ముందుగానే భారత్‌లోనూ విడుదలయ్యే అవకాశాలు కన్పిస్తున్నాయి. సెన్సార్ బోర్డు సూచించిన మార్పులకు చిత్రబృందం అంగీకరించింది. రెండు రోజుల్లో సెన్సార్ సర్టిఫికెట్ వస్తుందని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ఈ పనులు పూర్తికాగానే చిత్ర నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ విడుదల తేదీని అధికారికంగా ప్రకటించనుంది. ఓవర్సీస్ డిస్ట్రిబ్యూటర్లకు జులై 24 విడుదలకు సిద్ధంగా ఉండాలని ఇప్పటికే సమాచారం అందినట్లు తెలుస్తోంది.




# నెట్‌ఫ్లిక్స్‌లోకి వచ్చేసిన పెద్ది

రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో వచ్చిన చిత్రం 'పెద్ది' నెట్‌ఫ్లిక్స్ వేదికగా ఓటీటీ ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అయితే, థియేటర్ వెర్షన్ కంటే ఓటీటీలో కొన్ని సీన్స్ యాడ్ చేశారు. రన్‌టైం కారణంగా కట్ చేసిన సన్నివేశాలను, థియేటర్‌లో విడుదలైయ్యాక తొలగించిన సీన్స్‌ను కూడా ఇందులో యాడ్ చేసినట్లు తెలుస్తోంది. దీంతో అభిమానులు ఖుష్ అవుతున్నారు. తెలుగుతో పాటు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఇది అందుబాటులోకి వచ్చింది. కథేంటంటే.. విజయనగరం జిల్లాలోని కొండ కింద ఊరు అది. వందల మంది జీవనం సాగిస్తున్నా.. ప్రభుత్వ రికార్డుల్లో ఆ ఊరికి గుర్తింపు లేదు. అందుకే ఆ ఊరు అన్నా, అక్కడి నుంచి వచ్చిన మనుషులన్నా అందరికీ చిన్న చూపు. ఆ ఊళ్లో పుట్టి పెరిగిన వాడే పెద్ది (రామ్‌చరణ్). రోజూ విజయనగరం వెళ్లి కూలి పనులు చేస్తాడు. పేరుకి కూలీ అయినా క్రికెట్‌లో మాత్రం రాటుదేలిన ఆటగాడు. అందుకే విజయనగరం, బొబ్బిలి క్రికెట్ జట్లు వేలంలో పెద్దిని కొనేందుకు పోటీపడుతుంటాయి. ఆరు బంతులకు ఆరు సిక్సర్లు కొట్టగలిగిన మొనగాడైన పెద్దిని అంతా ఆట కూలీ అని పిలుస్తుంటారు. అలాంటి పెద్ది క్రికెట్‌ని వదిలి కుస్తీ క్రీడాకారుడిగా ఎందుకు మారాల్సి వచ్చింది? ఈ కథలో అచ్చియమ్మ (జాన్వీ కపూర్) ఎవరు?తన గ్రామం కోసం పెద్ది ఏం చేశాడు? అన్నదే సినిమా కథ.




# మరో సస్పెన్స్ థ్రిల్లర్... వదల




సీనియర్ నటుడు జగపతిబాబు ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న సైకలాజికల్ థ్రిల్లర్ 'వదల' విడుదలకు సిద్ధమవుతోంది. దర్శకుడు అకెళ్ల వి. కృష్ణ తెరకెక్కించిన ఈ చిత్రం ఈ నెల 17వ తేదీన ప్రేక్షకుల ముందుకు రానుండగా, ప్రస్తుతం చిత్ర బృందం ప్రమోషన్లను వేగవంతం చేసింది. ఈ నేపథ్యంలో తాజాగా విడుదలైన ట్రైలర్ సినిమాపై ఒక్కసారిగా అంచనాలను పెంచేసింది. ఈ చిత్రంలో లయ కథానాయికగా నటించగా, హృతిక శ్రీనివాస్ అత్యంత కీలక పాత్రలో కనిపించనున్నారు. కిషోర్ నాయుడు చిరుమామిళ్ల, తమ్మారెడ్డి భరద్వాజ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ట్రైలర్‌ను గమనిస్తే, మొదట ఒక సాధారణ కుటుంబ కథలా సినిమా ప్రారంభమవుతుంది. ఇరవై ఏళ్లుగా సంతోషకరమైన దాంపత్య జీవితాన్ని గడుపుతున్న దంపతులుగా జగపతిబాబు, లయ కనిపిస్తారు. ఒకరిపై ఒకరికి అపారమైన ప్రేమ, ఆప్యాయతతో జీవిస్తున్న వారి జీవితంలోకి అనూహ్యంగా ఓ యువతి ప్రవేశించడం కథను పూర్తిగా మలుపుతిప్పుతుంది. పక్కింటికి వచ్చిన ఆ యువతి జగపతిబాబు పాత్రపై ప్రమాదకరమైన స్థాయిలో మోజు పెంచుకోవడం, క్రమంగా అది వ్యామోహంగా మారడం ట్రైలర్‌లో ఆసక్తికరంగా చూపించారు. అదే సమయంలో లయ పాత్రకు గుర్తు తెలియని వ్యక్తుల నుంచి బెదిరింపులు రావడం, కుటుంబంపై ముప్పు పెరగడం కథలోని సస్పెన్స్‌ను మరింత పెంచుతోంది. ఈ చిత్రంలో కుటుంబాన్ని కాపాడుకోవడానికి పోరాడే వ్యక్తిగా జగపతిబాబు కనిపిస్తున్నారు. కుటుంబ బాధ్యతలు, అనుకోని ప్రమాదం మధ్య చిక్కుకున్న వ్యక్తి పాత్రలో ఆయన నటన ట్రైలర్‌లోనే ఆకట్టుకుంటోంది. లయ కూడా సహజమైన నటనతో కుటుంబ భావోద్వేగాలను బలంగా ఆవిష్కరించినట్లు కనిపిస్తోంది. మరోవైపు హృతిక శ్రీనివాస్ పోషించిన పాత్ర ట్రైలర్‌కే ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఆమె హావభావాలు, డైలాగ్ డెలివరీ, బాడీ లాంగ్వేజ్ సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతున్నాయి. దర్శకుడు అకెళ్ల వి. కృష్ణ మరోసారి థ్రిల్లర్ జానర్‌పై తన పట్టు చూపించినట్లు ట్రైలర్ స్పష్టం చేస్తోంది. కథలో ఎక్కడా సస్పెన్స్ తగ్గకుండా, అదే సమయంలో కుటుంబ భావోద్వేగాలను కూడా సమతుల్యంగా చూపించే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఆ యువతి అసలు ఉద్దేశం ఏమిటి? ఆమె జగపతిబాబు జీవితంలోకి ఎందుకు వచ్చింది? ఈ సంఘటనల వెనుక అసలు నిజం ఏమిటి? అనే ప్రశ్నలకు సమాధానం తెలుసుకోవాలనే ఆసక్తిని ట్రైలర్ చివరి వరకు కొనసాగిస్తుంది. ఈ చిత్రానికి ప్రముఖ సినిమాటోగ్రాఫర్ చోటా కె. నాయుడు అందించిన విజువల్స్ థ్రిల్లర్ మూడ్‌ను మరింత బలపరిచాయి. డార్క్ టోన్స్, విజువల్ ఫ్రేమింగ్ కథలోని ఉత్కంఠను పెంచేలా ఉన్నాయి. సంగీత దర్శకుడు కార్తీక్ కోడకండ్ల అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ప్రతి సన్నివేశానికి అదనపు థ్రిల్‌ను జోడించింది.